ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 51
శనివారం 20 జూలై 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## భారత్ అదిరే బోణీ

పాక్‌పై ఘనవిజయం

మహిళల ఆసియాకప్

07





## రాష్ట్రంలో విద్యా వ్యవస్థ
# మెరుగుకు చర్యలు

### 4 నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్

రెసిడెన్షియల్ బదులు కూడా.. విద్యార్థులకు ఉచిత రవాణా!

ప్రీ స్కూళ్లుగా అంగన్‌వాడీలు!.. త్వరలో విద్యా కమిషన్ ఏర్పాటు

వర్సిటీలకు వీసీలు, సిబ్బంది నియామకం.. విద్యావేత్తలతో సీఎం

విద్యారంగ బడ్జెట్‌ను గణనీయంగా పెంచుతామని వెల్లడి

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన బోధన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అంగన్‌వాడీలను ప్రీస్కూళ్లుగా మార్చే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. మూడో తరగతి వరకు ప్రీస్కూళ్లలోబీ 4 నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యమైన బోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

హైదరాబాద్, జూలై 19 : శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి పలువురు విద్యావేత్తలతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఏడాదికి రెండుసార్లు టెట్ నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలుతెరిచిన రోజే పిల్లలందరికీ యూనిఫాంలు, పాఠ్య పుస్తకాల అందజేయడంతోపాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా బడుల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టినట్లు

మిగతా 2 లో





# విస్తారంగా వర్షాలు

### ఉధృతంగా వాగులు.. తెగిన రోడ్లు

పలు జిల్లాల్లో భారీ వర్షాలు

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో 16.7 సెంటీమీటర్ల వర్షపాతం

సగానికి పైగా నిండిన తుంగభద్ర

జూరాలను చేరిన కృష్ణా జలాలు

నేడు, రేపు అత్యంత భారీ వర్షాలు

5 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ



రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం 8 మండలాల్లో అత్యంత భారీ వర్షాలు కురవగా.. 35 మండలాల్లో భారీ వానలు పడ్డాయి. ప్రధానంగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. వానలతో

మిగతా 2 లో

NDSA

National Dam Safety Authority

Ministry of Jal Shakti, Government of India

# బ్యారేజీలపై నివేదికను అమలు చేశారా!

### నేడు సమగ్ర నివేదికతో సమావేశానికి రండి

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌డీఎస్‌ఏ లేఖ.. ఢిల్లీలో భేటీ

హాజరుకానున్న ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 19 : కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి కారణాలు తెలుసుకునేందుకుగాను తగిన పరీక్షలు చేయాలంటూ తామిచ్చిన నివేదికను అమలు చేశారా? అని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆ నివేదిక ప్రకారం ఏయే చర్యలు తీసుకున్నారనే అంశాలపై సమీక్షించేందుకు శనివారం న్యూఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశానికి నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మిగతా 2 లో

# గ్రూప్-2 వాయిదా..

డిప్యూటీ సీఎంను కలిసిన అభ్యర్థులు

వాయిదా అంశాన్ని పరిశీలించాలని టీజీపీఎస్సీ చైర్మన్‌కు సూచించిన భట్టి

పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన కమిషన్



హైదరాబాద్ , జూలై 19 : గ్రూప్-2 పరీక్షలు వాయిదా పడ్డాయి. ఆగస్టు 7, 8వ తేదీల్లో జరగాల్సిన ఈ పరీక్షలను డిసెంబరుకు వాయిదా వేశారు. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీజీపీఎస్సీ) శుక్రవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేసింది. వరుసగా పోటీ పరీక్షలు ఉన్నందున గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 18న ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు ఆగస్టు 5 వరకు

మిగతా 2 లో

# రైతు సంక్షేమానికి పాల్పడ్డ ఘనత కేసీఆర్‌దే

అనేక పథకాలతో వారికి అండగా నిలిచారు

ఇప్పుడే రైతులు నానా యాతన పడుతున్నారు

ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. రైతును రాజు చేశారు. దండగన్న వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత కేసీఆర్‌దేనని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారు. రెండు దఫాలుగా పంటల రుణమాఫీ చేశారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతుకు, అతని కుటుంబానికి ఆర్థిక భరోసా నింపారు.

హైదరాబాద్,జూలై19 : కొత్త ప్రాజెక్టులతో పాటు పెండింగ్ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించి రైతులకు కరెంట్ కష్టాల

మిగతా 2 లో





# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలల ఏర్పాటు

భూముల గుర్తింపు, మౌలిక సదుపాయాల కోసం కార్యాచరణ

అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి

రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలల ఏర్పాటు కోసం భూముల గుర్తింపు, ఇతర మౌలిక సదుపాయాల కోసం తీసుకోవాల్సిన చర్యలపై సీఎం శాంతి కుమారి శుక్రవారం సచివాలయంలో వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, తల్లిదండ్రులు తమ పిల్లలను కలవడానికి ప్రత్యేక గది ఉండేలా చూడాలని.. భవనాలన్నింటికీ ఏకరీతి డిజైన్‌ను వారంలోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్,జూలై19 : పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వ సలహాదారుతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఈ ప్రాజెక్ట్‌కి నోడల్ ఆఫీసర్‌గా, ఇతర సంక్షేమ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారన్నారు. 49 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, అందులో ఎనిమిది పాఠశాలలు ఈ ఏడాది గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. 31 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ఇప్పటికే జిల్లా కలెక్టర్లు భూమిని గుర్తించగా, మిగిలిన పది పాఠశాలలకు సంబంధించి భూమి గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. భూముల గుర్తింపు, ఇతర మౌలిక సదుపాయాల కోసం తీసుకోవలసిన చర్యలపై ఉన్నతాధికారులతో

మిగతా 2 లో

# రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మెరుగుకు చర్యలు

**మొదటి పేజీ తరువాయి**

వివరించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, విద్యావేత్తలు ఇచ్చే మంచి సూచనలు స్వీకరిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, పి.ఎల్.విశ్వేశ్వరరావు, శాంతా సిన్హా, ఆల్దాస్ జానయ్య, పద్మజా షా, లక్ష్మీనారాయణ, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి విద్యా వ్యవస్థ బలోపేతానికి పలు సూచనలు చేయడంతో పాటు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో కార్యకర్తలకు బోధించే నైపుణ్యం ఉండడం లేదని, సరైన వసతులు లేవని చెప్పారు. వాటిని ప్రీ స్కూళ్లుగా మార్చి, వలంటీర్లను తీసుకొని వారికి అవసరమైన శిక్షణ ఇచ్చే యోచన చేస్తున్నట్లు తెలిపారు. ఇక నాలుగో తరగతి నుంచి 12వ తరగతి దాకా సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులకు ప్రభుత్వమే ఉచిత రవాణా సదు-పాయం కల్పించాలనే యోచనలో ఉన్నట్లు చెప్పారు.



**నేను, భట్టి సర్కారీ బడిలోనే చదివాం..**

పదేళ్లుగా యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది నియామకం జరగలేదని, వీసీలు లేరని ప్రొఫెసర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం.. ఇప్పటికే సెర్చ్ కమిటీలు వేశామని, త్వరలోనే వీసీల నియామకం పూర్తవుతుందని తెలిపారు. యూనివర్సిటీలకు డెవలప్‌మెంట్ గ్రాంట్లు ఇవ్వాలని, ప్రతి వర్సిటీలో వివిధ అంశాలపై లోతైన చర్చ జరగాలని, అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ జానయ్య ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. విద్యా సూచికలో తెలంగాణ అట్టడుగున ఉందని, తామంతా ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే చదువుకున్నామని, ప్రస్తుతం అక్కడా విద్యా ప్రమాణాలు పడిపోయాయని ప్రొఫెసర్లు హరగోపాల్, శాంతా సిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి తాము ఇప్పటికే మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు.

విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై విధాన పత్రం రూపొందిస్తే.. దానిపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆయా అంశాలపై మంత్రివర్గ ఉపసంఘంతోనూ చర్చించాలని వారికి సూచించారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు అతి తక్కువ వడ్డీకి దీర్ఘకాలిక రుణాలు ఇస్తాయని, ఇప్పటికే పలు రాష్ట్రాలు వాటి సాధనకు ప్రయత్నిస్తున్నాయని ప్రొఫెసర్ జానయ్య సీఎంకు చెప్పగా.. ఆ అంశాన్ని పరిశీలిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో 11 శాతంగా ఉన్న విద్యా శాఖ బడ్జెట్ తెలంగాణ ఏర్పడిన తర్వాత 6.4 శాతానికి పడిపోయిందని, విద్యా వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంపు అవసరమని ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. తాను, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇద్దరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామని, కచ్చితంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి బడ్జెట్ పెంచుతామని సీఎం అన్నారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవాలని సీఎం నిర్ణయించారని, బడ్జెట్ కేటాయింపులు తప్పకుండా పెంచుతామని భట్టి తెలిపారు. భేటీలో ప్రభుత్వ సలహాదారు కేకే, సీఎం ప్రధాన కార్యదర్శి శేషాద్రి, కార్యదర్శి మాణిక్‌రాజ్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.

**ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి: సీఎం రేవంత్**

రాష్ట్రంలో రాబోయే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని ఆదేశించారు. శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టితో పాటు అధికారులతో కలిసి ఆయన విద్యాశాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సమీకృత రెసిడెన్షియళ్లతో సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలు కొనసాగేలా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు.


3వ తరగతి వరకు సొంత గ్రామాల్లోని అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో చదివిన అనంతరం 4వ తరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. 3వ తరగతి వరకు అంగన్‌వాడీల్లోనే విద్యాబోధన అందించేందుకు చేపట్టాల్సిన చర్యలను పరిశీలించాలని, అంగన్‌వాడీల్లో అదనంగా మరో టీచర్‌ను నియమించేలా ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. ఆయా ప్రణాళికలను రూపొందించడానికి ముందే విద్యావేత్తలతో చర్చించి, వారి అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పారు. వారి సూచనల మేరకు ఒకటి, రెండు మండలాల్లో ప్రీ స్కూల్, సెమీ రెసిడెన్షియల్స్ విధానాన్ని పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సూచించారు.



# విస్తారంగా వర్షాలు

**మొదటి పేజీ తరువాయి**

చాలా చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లగా.. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండు కుండలా మారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. ఇళ్లలోకి నీరు చేరింది. కొన్ని జిల్లాల్లో మారుమూల గ్రామాలకు రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో అత్యధికంగా 16.7 సెం.మీ., అదే జిల్లా పెంచికల్‌పేటలో 15.4, మంచిర్యాల జిల్లా వేమనపల్లిలో 15.2, అదే జిల్లా కోటపల్లిలో 13.6, పెద్దపల్లి జిలా మంథని మండలంలో 12.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది.



**గ్రామాలకు నిలిచిన రాకపోకలు**

ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. బెజ్జూర్ మండలం కొత్తగూడలో భారీ వర్షానికి సోమిని-కృష్ణపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని ఏదులబందంలో తుతుంగ ప్రాజెక్టు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రధాన రహదారి తెగిపోయి సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా శ్రీరాంపూర్‌లోని ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లోని పలు ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం ఆలుబాకకు చెందిన బానారి రాజు అనే వ్యక్తి గోదావరిలో గల్లంతయ్యాడు. చేపలు పట్టేందుకు వెళ్లిన అతడు వరదలో కొట్టుకుపోయాడు.

నదీ ప్రవాహం అధికంగా ఉండటంతో ఆచూకీ లభ్యం కాలేదు. వాజేడు బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో గురువారం రాత్రి వర్షానికి స్లాబ్ పెచ్చులు ఊడిపడి కంప్యూటర్లు ధ్వంసమవ్వగా.. దస్తావేజులు దెబ్బతిన్నాయి. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 600 ఎకరాల్లో పత్తి, వరి పంటకు నష్టం వాటిల్లిందని సమాచారం. అదే జిల్లా కాటారం మండలంలో అలుగువాగు వద్ద బొలెరో వాహనం కొట్టుకుపోగా డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరుసగా మూడో రోజూ వర్షం కురిసింది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం పెరుగుతోంది. సాయంత్రానికి 26.5 అడుగులకు చేరుకుంది.

**ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద**

కృష్ణా-గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద క్రమంగా పెరుగుతోంది. తుంగభద్ర జలాశయం సగానికి పైగా నిండింది. శుక్రవారం సాయంత్రానికి ఈ జలాశయానికి 1,07,632 క్యూసెక్కుల వరద వస్తోంది. తుంగభద్ర పూర్తి స్థాయి సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 59.80 టీఎంసీలున్నాయి. ఇక తుంగభద్ర ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండిపోయాయి. ఇక జూరాల ప్రాజెక్టును కృష్ణా జలాలు తాకాయి. ఈ ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా... జలవిద్యుదుత్పాదనతో 37,905 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 32,673 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. నాగార్జునసాగర్‌కు 8,462 కూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. కాలువల ద్వారా 6,145 కూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇక గోదావరి బేసిన్‌లోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు 17,283 క్యూసెక్కులు వరద వస్తోంది. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం)బ్యారేజీకి 3.75 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం)కు 3.47 లక్షల క్యూసెక్కులు, అదే మేడిగడ్డకు 3.41 క్యూసెక్కులు, అన్నారం బ్యారేజీకి 12,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... వచ్చింది వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు.

**రెండ్రోజులు అత్యంత భారీ వర్షాలు..**

రాష్ట్రంలో రెండ్రోజుల పాటు కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారానికి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి.. ఈ ఐదు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, భూపాలపల్లి, నిజామాబాద్.. ఈ 4 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వివరించింది.

**వరదలపై గంటకో సారి సమీక్షించండి: ఉత్తమ్**

భారీ వర్షాల నేపథ్యంలో భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల్లోకి వచ్చే వరదను గంటకోసారి పర్యవేక్షించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల గేట్లను మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని సూచించారు. కొత్తగూడెం జిల్లా పెద్దవాగు ప్రాజెక్టుకు గండ్లు పడటాన్ని దురదృష్టకర సంఘటనగా అభివర్ణించారు. ప్రాజెక్టుల నుంచి వరదను వదిలే క్రమంలో దిగువ ప్రాంతాల్లో తగిన హెచ్చరికలు జారీ చేయాలని, దీనికోసం స్టాండింగ్ ఆపరేషన్ ప్రోటోకాల్ పాటించాలన్నారు. ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చూసుకోవాలన్నారు.

క్షేత్రస్థాయిలోని ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఏఈలు అందుబాటులో ఉండాలన్నారు. చీఫ్ ఇంజనీర్లు ఎవరూ కూడా హెడ్‌క్వార్టర్‌ను వీడరాదని నిర్దేశించారు. ఇటు నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రాజెక్టులు, కాలువల గేట్లన్నీ పనిచేస్తున్నాయా? లేవా? అనే అంశాలను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. భారీ వర్షాలతో 'మెరుపు వరదలు' వస్తున్నాయని, ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల కింద నివాసముంటున్న వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలల ఏర్పాటు

**మొదటి పేజీ తరువాయి**

సమీక్షించారు. ముఖ్యమంత్రి దార్శనికత మేరకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు,
తల్లిదండ్రులు తమ పిల్లలను కలవడానికి ప్రత్యేక గది మొదలైనవి ఉండాలని, ఈ భవనాలన్నింటికీ ఏకరీతి డిజైన్‌ను వారంలోగా సిద్ధం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వ సలహాదారుతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఈ ప్రాజెక్ట్‌కి నోడల్ ఆఫీసర్‌గా, ఇతర సంక్షేమ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. 49 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, అందులో ఎనిమిది పాఠశాలలు ఈ ఏడాది గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. 31 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ఇప్పటికే జిల్లా కలెక్టర్లు భూమిని గుర్తించగా, మిగిలిన 10 పాఠశాలలకు సంబంధించి భూమి గుర్తింపు పక్రియ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్ రాజు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# బ్యారేజీలపై నివేదికను అమలు చేశారా!

**మొదటి పేజీ తరువాయి**

హాజరుకానున్నారు. కాగా, కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి గల కారణాలపై వా నాకాలానికి ముందు జియో ఫిజికల్, జియో టెక్నికల్, స్ట్రక్చరల్ స్టెబిలిటీ పరీక్షలు చేసి, నివేదిక ఇవ్వాలని ఎన్‌డీఎసఏ సూచించింది.
ఈ పరీక్షలను కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రిసేర్చ్ స్టేషన్(సీఎసఎంఆర్ఎస), జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ)లతో చేయించాలని మే 1న ఎన్‌డీఎసఏ మధ్యంతర నివేదికను ఇచ్చింది. ఆ తరువాత.. ఈ నివేదిక అమలు ఎక్కడిదాకా వచ్చిందని ప్రశ్నిస్తూ మే 13వ తేదీతోపాటు జూన్ 25న, ఈ నెల 11న తెలంగాణకు ఎన్‌డీఎసఏ లేఖలు రాసింది. అయితే అన్నారం, సుందిళ్లలో పరీక్షల కోసం బోర్‌హోల్స్ వేస్తుండగా.. ఇసుక, నీరు బయటికి వస్తున్నాయని తెలంగాణ పేర్కొంది.
ఈ నేపథ్యంలో పరీక్షలు నిలిపివేసి చేసి, జియో టెక్నికల్ పరీక్షల కోసం ప్రత్యామ్నాయాలు సూచించాలని తెలంగాణ ఈనెల 5న లేఖ రాసింది. దీంతో అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఇప్పటిదాకా ఎన్ని బోర్‌హోల్స్/డ్రిల్లింగ్స్ చేశారు? బ్యారేజీల ఎగువ, దిగువ భాగంలో ఇప్పటిదాకా ఎన్ని డ్రిల్లింగ్ చేశారు..? వంటి అంశాలపై సమగ్ర వివరాలు అందించాలని ఎన్‌డీఎసఏ కోరింది. సీడబ్ల్యూపీఆర్ఎస్ ఇచ్చిన నివేదిక, బ్యారేజీలపై అధ్యయనాలపై ఫొటోలు సహా సమగ్ర నివేదికను అందించాలని ఎన్‌డీఎసఏ నిర్దేశించింది. ఈ అంశాల ఆధారంగా శనివారం సమావేశంలో చర్చించనున్నారు.

# గ్రూప్-2 వాయిదా..

**మొదటి పేజీ తరువాయి**

కొనసాగనున్నాయి. వెంటనే ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు ఉన్నాయి. దీంతో ఈ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గ్రూప్-2 అభ్యర్థులు, నిరుద్యోగులు శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు.
గ్రూప్-2 పరీక్షలను డిసెంబరులో నిర్వహించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చిస్తామని భట్టి చెప్పారు. వెంటనే టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి ఫోన్ చేసి, పరీక్షలను డిసెంబరు చివరి వారానికి వాయిదా వేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఉద్యోగ ఖాళీలను గుర్తించి, త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని భట్టి తెలిపారు. ప్రభుత్వాన్ని బెదిరించి, కేసుల పాలైతే అభ్యర్థులే నష్టపోతారని అన్నారు. స్వార్థ రాజకీయాలతో కొందరు చేసే కుట్రల్లో ఇరుక్కుని నష్టపోవద్దని అభ్యర్థులకు హితవు పలికారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం నియోజకవర్గాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభిస్తామన్నారు. మంత్రి భట్టి సూచనల తర్వాత గ్రూప్-2 పరీక్షలను డిసెంబరుకు వాయిదా వేస్తున్నట్లు టీజీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. అయితే పరీక్షల తేదీలను మాత్రం ప్రకటించలేదు.

**ఇది నిరుద్యోగుల విజయం: బీజేపీ**

గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నిరుద్యోగుల విజయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ తెలిపారు. నిరుద్యోగులకు మద్దతుగా బీజేపీ చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. కొత్త తేదీల ప్రకటనతో పాటు పోస్టుల సంఖ్య పెంపుపై కూడా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**ఓయూలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయడాన్ని హర్షిస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో అభ్యర్థులు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

# రైతు సంక్షేమానికి పాల్పడ్డ ఘనత కేసీఆర్‌దే

**మొదటి పేజీ తరువాయి**

నుంచి విముక్తి చేశారు. వీటన్నింటితో పాటు మరిన్ని రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి.. రైతులను రాజులుగా తయారు చేశారు కేసీఆర్. కానీ అదే కాంగ్రెస్ గవర్నమెంట్‌లో రైతులు అరిగోస పడుతున్నారు. లక్ష రూపాయాల వరకు రుణమాఫీ అని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. చివరకు లక్ష వరకు రుణాలున్న చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రేవంత్ సర్కార్‌పై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. రేషన్ కార్డు లేదని చాలా మందికి రుణాలు మాఫీ చేయలేదని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్ హయాంలో సాగుకు స్వర్ణయుగం.. లక్ష కోట్లకు పైగా సంక్షేమం జరిగిందని తెలిపారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతన్నకు నేరుగా లక్షల కోట్ల రూపాయాల ఆర్థిక సాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు.రైతుభంధు పథకం కింద 69 లక్షల మంది రైతులకు రూ. 72,972 కోట్లు అందించారు. 11 వేల మంది రైతు కుటుంబాలకు రైతుబీమా కింద రూ. 6,488 కోట్లు అందజేశారు. రెండు దఫాల్లో రూ. 29,144.61 కోట్ల రుణమాఫీ చేశారు. ఇతర రైతు సంక్షేమ పథకాల కింద రూ.11.401 కోట్లు ఖర్చు పెట్టారు. కేవలం ఈ పథకాల ద్వారానే రైతులకు అందిన ఆర్థిక సాయం రూ. 1,20,005 కోట్లు.. దేశ చరిత్రలో ఇది ఆల్ టైం రికార్డ్ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# అల్పపీడనంతో కలెక్టర్లతో సిఎం బాబు సమీక్ష

**అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సూచన**

**సిఎం ఆదేశాలతో సిబ్బందిని అప్రమత్తం చేసిన అనిత**

అమరావతి,జూలై1 9 : బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలపై సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని నివాసంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 8 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జిల్లాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముందస్తు ప్రణాళికతో పనిచేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. చెరువులు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. గతంలో జరిగిన ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలతో గోదావరి కట్టలు బలహీనపడ్డాయని.. వాటిపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. విపత్తులు వచ్చినప్పుడే సమర్థత బయటపడుతుందని చెప్పారు. వాతావరణశాఖ హెచ్చరికలు, పరిస్థితులను అంచనా వేసి అప్రమత్తంగా వ్యవహరిస్తే నష్టాలను నివారించవచ్చని సూచించారు.సీఎం చంద్రబాబు ఆదేశాలతో మంత్రి అనిత అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు, వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ఏలూరు, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. మరోవైపు మంత్రి అనిత శ్రీవారి దర్శనం కోసం శుక్రవారం తిరుమల వెళ్లారు. అలిపిరి కాలినడక మార్గంలో కొండపైకి బయల్దేరారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 20 జూలై 2024





# చలో ఢిల్లీని విజయవంతం చేయాలి : పల్లగొర్ల మోదీరాందేవ్




భువనగిరి,జూలై19(రోమింగ్ న్యూస్)ఆగస్టు 5, 6న జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరిలోని కాలేజీలు, హాస్టళ్ల విద్యార్థులతో కలిసి కరపత్రం ఆవిష్కరణ చేశారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమానికి లక్షలాదిమందిగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు వట్టెం మధు, చిన్నం సాగర్,పబ్బాల ఎలీషా, మనీషా రెడ్డి, శాలిని నాయక్, మాధురి, సంగీత, మౌనిక గౌడ్, వసుందరి, ప్రత్యూష, మానస, సునీత పాల్గొన్నారు.

# బావి పూడికతీత పనులు ప్రారంభం



భువనగిరి,జూలై19(రోమింగ్ న్యూస్ )మండలంలోని వడపర్తి గ్రామంలో నీటి సమస్య పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ ఎలిమినేటి కృష్ణారెడ్డి బావి పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య తలెత్తగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని సంప్రదించగా సమస్య పరిష్కారం కోసం బావి పూడిక తీత పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్ర మహేష్, ముదుగుల ఆనంద్, జూపల్లి సురేష్, మెడబోయిన చింటూ, ఆంజనేయులు, శ్రీశైలం, తుమ్మల లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని ఎంపీకి వినతి



భువనగిరి,జూలై19(రోమింగ్ న్యూస్) : కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆద్వర్యంలో శుక్రవారం భువనగిరి ఎంపీ సామల కిరణ్ కుమార్ రెడ్డి కి శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరెన్సీ నోట్ల పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ కొడారి వెంకటేష్, గౌరవాధ్యక్షులుబట్టు రామచంద్రయ్య, జిల్లా ఎస్సీ /ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె సుదర్శన్, తెలంగాణ దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పల్లెర్ల వెంకటేష్, నాయకులు నల్ల కృష్ణ, కుడుదుల సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలి...

**సిఐటియు ఆధ్వర్యంలో భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా**




భువనగిరి ,జూలై19(రోమింగ్ న్యూస్) : ఆశ వర్కర్లకు ప్రభుత్వం పరీక్ష పెట్టే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో తెలంగాణ ఆశా వర్కర్స్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుటి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా గ్రామాలలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్లకు పరీక్ష పెట్టే విధానాన్ని రద్దు చేయాలని పెరుగుతున్న ధరలు అనుకూలంగా పారితోషకాలు పెంచి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కసగోని లలిత, జిల్లా నాయకులు రంగ సంతోష, మండల అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు చంద్రకళ, అనిత, శోభ, అరుణ, సుజాత, పావని, లక్ష్మి పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యం చేయాలి

**భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



భువనగిరి,జూలై19(రోమింగ్ న్యూస్) : అభివృద్ధి సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందరికి అందేలా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలుతో కలిసి కలెక్టరేటు సమావేశ మందిరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుండి పార్లమెంట్ మొట్టమొదటి బడ్జెట్ సమావేశాలు మొదలవుతున్నందున పార్లమెంట్ సభ్యుడినైన నా నుండి ప్రజలు ఎన్నో ఆశిస్తారని, వారి అంచనాలకు అనుగుణంగా ప్రశ్నోత్తరాల సమయంలో జిల్లా ప్రజల సమస్యలపై వివరించడానికి ఇలాంటి సమీక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 31 వేల కోట్లతో ఆగష్టు చివరిలోపు 2 లక్షల రైతు రుణ మాఫీ చేసి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నారని అన్నారు. జనగాం యాదాద్రి స్టేషన్ పనుల నిధులు శాంక్షన్ అయ్యాయని, జనగాం స్టేషన్ 50 శాతం, యాదాద్రి స్టేషన్ 20 శాతం పనులు కావడం జరిగిందని, డిసెంబరు చివరి లోగా అన్ని పనులు పూర్తి అయ్యేలా రైల్వే అధికారులు పూనుకోవాలని తెలిపారు. ప్రతి రోజూ ఇతర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగుల కోసం భువనగిరి, ఆలేరు, జనగాం స్టేషన్లలో రైళ్లు ఆగేలా, పుష్ పుల్ రైల్ భువనగిరి లో ఆగేలా, అలాగే ఇంటర్ స్టేట్ రైల్ సర్వీసులు ఆగేలా కృషి చేస్తానని తెలిపారు. ఆలేరు పెద్దవాగు అండర్ పాస్ రోడ్ విస్తరణ అవసరమున్నందున రైల్వే శాఖ దృష్టికి తెస్తామని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీస్ చిట్యాల- భువనగిరి రోడ్డు విస్తరణ కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చి అనుమతులు సాధిస్తామని తెలిపారు.

భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గురువారం జరిగిన రైతు రుణమాఫీ చరిత్రాత్మకంగా నిలుస్తుందని, 31 వేల కోట్లతో 2 లక్షల రుణ మాఫీ ఎక్కడా జరుగలేదని, నిన్న రాష్ట్రంలో మొత్తం పండుగ వాతావరణం ఉందని, ఇది మంచి పరిణామమని, అలాగే ఆరు గ్యారెంటీ పథకాలను ఇంకా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్రాల ఆధ్వర్యంలో జరిగే పనులు, నిధులు, వాటి ప్రయోజనాలు ప్రజలకు తెలియాలని అన్నారు. సాగునీరు సంబంధించి ధర్మారెడ్డి, బునియాదిగాని కాలువ, పిన్నాయిపల్లి పనులు ఈ బడ్జెట్లోనే పెట్టే విధంగా కృషి చేస్తానని, దాదాపు 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది కాబట్టి ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి రెండు సంవత్సరాలలో కాలువల పనులు పూర్తి చేస్తామని తెలిపారు. బస్వాపూర్ మిగిలిపోయిన పనులను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఎయిమ్స్ ఆసుపత్రి ద్వారా పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా చూస్తామని, భువనగిరిలో మెడికల్ కాలేజీ శాంక్షన్ అయ్యిందని, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు మెరుగయ్యాయని, ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో ఆసుపత్రిని ఇంకా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం పెరగాలని, రైతాంగం అవసరం తెలుసుకొని, రైతాంగం మేలు కోరి రాష్ట్ర ముఖ్యమంత్రి 2 లక్షల రుణ మాఫీ ప్రకటించి నిన్న మొదటి విడుతగా 6098 కోట్లతో ఒక లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేశారని అన్నారు. ఏ పథకం ఏ విధంగా ప్రజలకు ఉపయోగపడుతుంది అనేది ప్రజలకు వివరించాలని, వారికి అందుబాటులోనికి తేవాలని, పేదవారికి కేంద్ర ప్రభుత్వ నిధులు ఉపయోగపడేలా చూడాలని, అందుకోసం ఇలాంటి సమీక్షలు చాలా అవసరమని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా నిధుల మంజూరీతో ఇంకా ఎక్కువ మొత్తంలో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అందరికి అవగాహన ఉండాలని, జిల్లాలో లేని, జిల్లాకు అవసరమైన పథకాలు గుర్తించి వాటి కార్యాచరణకు వివరాలు అందించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల వివరాలను ఎం.పి. గారికి అందించాలని, వారు పనుల పురోగతిని ఇంకా ముందుకు తీసుకెళ్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.ఎ. కృష్ణన్, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పెండింగులో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

**భారతీయ విద్యార్థి మోర్చ BVM జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ డిమాండ్**




కామారెడ్డి, జూలై 19 (రోమింగ్ న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని బిక్నూర్ మండల కేంద్రంలో భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8 వేల కోట్లపైగా స్కాలర్షిప్స్ రియంబర్స్మెంట్ పెండింగ్లో ఉందని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన విద్యార్థులకు సకాలంలో స్కాలర్షిప్ విడుదల చేయలేదన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు స్కాలర్షిప్ల పైనే విద్యార్థులు అధిక సంఖ్యలో చదువుకుంటున్నారన్నారు. స్కాలర్షిప్ పెండింగ్లో ఉండటం వలన వారు ఉన్నత చదువుల కోసం వెళ్లడానికి ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు ఫీజులు కట్టాలని లేనిపక్షంలో సర్టిఫికెట్ ఇవ్వమని డిమాండ్ చేస్తున్నారు. దీనివలన చాలామంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. గత మూడు సంవత్సరాల నుండి స్కాలర్షిప్ ఫ్రీయంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం ప్రైవేట్ కళాశాల యజమాన్యాలు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఈ ప్రభుత్వం అయినా స్పందించి గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం చేయొద్దని ఎలాంటి షరతులు పెట్టకుండా పెండింగ్లో ఉన్న 8 వేల కోట్ల స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాము. లేనిపక్షంలో విద్యార్థులతో విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ రమేష్ , మండల నాయకులు కర్రోళ్ల రాజు,రజినీకాంత్, సంతోష్,తదితర నాయకులు పాల్గొన్నారు

# మన వార్డుకు మన చైర్మన్ తో సమస్యల పరిష్కారం: చైర్మన్ పోతంశెట్టి



భువనగిరి ,జూలై19(రోమింగ్ న్యూస్) : మన వార్డుకు మన చైర్మన్ అనే కార్యక్రమంతో పట్టణంలోని అన్ని వార్డులలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం 23వ వార్డులో పర్యటించి వార్డు సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి వార్డులోని ప్రతి గల్లీ గల్లీ తిరిగి ఆ ప్రాంతంలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయడమే మనవార్డు కు మన చైర్మన్ లక్ష్యమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటామని ప్రజల కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామాంజుల్ రెడ్డి, 23వ వార్డు కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్, ఇంజనీర్ కొండలరావు, ఎస్ఐ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించిన నగర మేయర్

శ్రీశైలం, జూలై 19 (రోమింగ్ న్యూస్ ) : గిరి ప్రదక్షిణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను కల్పించండి.సింహాచలం గిరి ప్రదక్షిణ మార్గం లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అవసరమగు సౌకర్యాలను కల్పించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె గిరి ప్రదక్షిణ రోడ్డు సింహాచలం తొలి పావంచ నుండి అడవివరం, హనుమంతువాక, విశాలాక్షి నగర్, అప్పుఘర్, ఇసుకతోట, సీతమ్మధార, మాధవధార, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ (డెవలప్మెంట్) కె.ఎస్.విశ్వనాథన్ మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి సింహాచలం గిరి ప్రదక్షిణ లో లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారని, ఏడాదికి ఒకసారి వచ్చే గిరి ప్రదక్షిణ భక్తులకు అరుదైన అవకాశం మని , గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. గిరి మార్గంలో పారిశుద్ధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కేంద్రాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు మొదలైన ఏర్పాట్లు పై మేయర్ కు అదనపు కమిషనర్ విశ్వనాథన్ వివరించారు . పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమగు కార్మికులను ఏర్పాటు చేయాలని, పలుచోట్ల మొబైల్ మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, లుంబినీ పార్కు సమీప బీచ్ లో స్నానమాచరించు భక్తులకు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని, బీచ్ లో భక్తులు ప్రమాదలకు గురి కాకుండా లైఫ్ గార్డులను ఏర్పాటు చేయాలన్నారు. జివిఎంసి ఏర్పాటు చేయు త్రాగునీటి కేంద్రాల వద్ద,



నడక మార్గం లో ఎప్పటికప్పుడు పరిశుభ్రతా విధులు చేపట్టుటకు 24 గంటలు సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. నడక మార్గం లో భక్తుల అవగాహన కొరకు జివిఎంసి పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్స్ ద్వారా ఆడియో జింగిల్స్ ను తయారు చేసి ప్రచార కార్యక్రమం తదితర సౌకర్యాలను చేపట్టాలన్నారు. భక్తుల సౌకర్యార్థం, జివిఎంసి తరపున తాగునీరు, అలాగే వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు, మొబైల్ టాయ్ లెట్లను ఏర్పాటు చేసి వాటిలో సమృద్ధిగా నీటిని ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, భక్తులకు ప్రసాద వితరణ చేయు స్వచ్ఛంద సంస్థలు, పలు సంఘాలు, దాతలకు నడక మార్గం లో అవసరమగు స్థలాలను సూచించామని, ఆహార పదార్థాలు ప్లాస్టిక్ లో కాకుండా ఆకులు, కాగితంతో తయారుచేసిన ప్లేట్లలలో అందించేలా సూచించడం జరిగినదని, ప్రసాదం కౌంటర్ల వద్ద నడక మార్గం లో అవసరమగు డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయడమైనదని అదనపు కమీషనర్ కె.ఎస్.విశ్వనాధన్ మేయర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డా.వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజనీర్ రవి కృష్ణ రాజు, ప్రధాన వైద్యాదికారి డా.నరేష్ కుమార్, డిడిహెచ్ ఎం.దామోదరరావు, జోనల్ కమీషనర్లు శైలజవల్లి, విజయలక్ష్మి, ఆర్.జి.వి.క్రిష్ణ, హైమావతి, పర్యవేక్షక ఇంజినీర్లు సాంసన్ రాజు, వేణుగోపాల్ రావు, రామ్ మోహనరావు, ఎ.ఎం,ఒ.హెచ్ లు డా.ఎన్.కిషోర్, డా.క్రిష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 20 జూలై 2024




# ఉజ్జయిని మహంకాళి బోనాలకు భారీగా ఏర్పాట్లు

**ఆది,సోమవారాల్లో రెండ్రజోలు బోనాల ఉత్సవాలు**

**1500 మంది పోలీసులతో భారీగా బందోబస్తు**

**మహిళ భద్రత కోసం షీ టీంల గస్తీ**

**క్యూ లైన్లలో కలిపి మొత్తం 100 సీసీ కెమెరాలు**

**హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ వెల్లడి**



హైదరాబాద్,జూలై 19 : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ చెప్పారు. 21,22న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు జరగనున్నాయని తెలిపారు. ఆదివారం మహంకాళి బోనాలు,ఆ తర్వాత రోజు రంగం, అంబారీ కార్యక్రమం ఉంటుందన్నారు. బోనాల జాతర సందర్భంగా ఈ సారి నెల రోజుల నుంచి ఏర్పాట్లపై కసరత్తు చేశామని చెప్పారు. మహంకాళి బోనాలకు 1500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. టెంపుల్ చుట్టూ పక్కల క్యూ లైన్లులో కలిపి మొత్తం 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని డీసీపీ రష్మి పెరుమాళ్ వెల్లడించారు. మహిళ భద్రత కోసం షీ టీంలు ఏర్పాటు చేశామని తెలిపారు.భక్తుల దర్శనానికి ఆరు క్యూ లైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని లైన్లలో ఒక ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో రెండు ప్రత్యేక లైన్స్ బోనాలతో వచ్చే వారికి ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన సామాన్య భక్తుల దర్శనం కోసం క్యూ లైన్ ఏర్పాటు చేశాము. మరో రెండు లైన్లు దేవాలయం పాసులు జారీ చేసిన వారికి ఏర్పాటు చేశాం. అమ్మవారికి బోనం సమర్పించేందుకు వచ్చే వారికి ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశాము. బోనం ఎత్తుకొని వచ్చే వారితో పాటు ఐదుగురికి అనుమతి ఉంటుంది. ప్రసాదం కౌంటర్ల కూడా ఈసారి ఎక్కువ గా ఏర్పాటు చేశాము. ఎగ్జిట్ పాయింట్ దగ్గర ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశాము. బోనాలకు వచ్చే వారు పోలీసులకు సహకరించాలి. గతేడాదితో పోల్చుకుంటే.. ఈసారి ఎక్కువ మంది వస్తారని అంచనా వేస్తున్నాము. అందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు డీసీపీ.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.10 నుంచి 15 లక్షలు మంది వస్తారని అంచనా. శివ శక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాము. ఉదయం వేళల్లో రద్దీ ఉంటుంది కాబట్టి. వాళ్లు దర్శనం చేసుకునేందుకు స్పెషల్ టైం 1:30నుండి 4 గంటల మధ్య వారు రావాలి. శివ శక్తులు, బోగినిలు బాటా నుంచి రావాలి.. జంక్షన్ నుంచి నేరుగా టెంపుల్ లోకి రావొచ్చు. ఒక్కో శివ శక్తులకు బోగినిలకుతో పాటు ఐదుగురికి అనుమతి ఉంటుంది. వారితో గుంపులు గుంపులుగా వస్తారు కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నామని అనారు. ఈసారి స్థానికుల అభిప్రాయాన్ని పలుమార్లు తీసుకున్న తర్వాతే ఏర్పాట్లు చేశాము. రెండు రోజుల పాటు మా బందోబస్తు ఉంటుంది. ఫలహారం బండ్ల కోసం ఈసారి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పెట్టామని డీసీపీ రష్మి పెరుమాళ్ చెప్పారు.

## ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్‌కు డాక్టరేట్

**మద్రాస్ ఐఐటి నుంచి పట్టా అందుకున్న శాస్త్రవేత్త**

చెన్నై,జూలై 19 : ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ మద్రాస్ ఐఐటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. శుక్రవారం ఐఐటీ మద్రాస్‌లో జరిగిన 61వ స్నాతకోత్సవంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆయన డాక్టరేట్‌ను పొందారు. 60ఏళ్ల వయసులో ఆయన పీహెచ్‌డీ పట్టా అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ... మద్రాస్ ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఒక పల్లెటూరిలో పుట్టి పెరిగిన నేను టాపర్ అయినప్పటికీ ఐఐటీ ప్రవేశ పరీక్ష రాసే ధైర్యం కూడా చేయలేదు. ఇక్కడి నుంచి గ్రాడ్యుయేషన్ చేయాలనే కోరిక మాత్ర ఉండేది. ఆ కల ఇప్పుడు నెరవేరింది. గతంలో ఐఐటీ-బెంగళూరు నుంచి మాస్టర్స్ డిగ్రీ అందుకున్నా. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడే నా జీవితంలో సాధించాల్సిన విషయాలపై శ్రద్ధ పెట్టాలని, వాటిని నెరవేర్చుకునేందుకు నిరంతరం ప్రయత్నించాలని నిర్ణయించుకున్నాను' అని సోమనాథ్ తెలిపారు. కేరళలోని అళెప్పి జిల్లాలో జన్మించిన సోమనాథ్.. అదే జిల్లాలో ఆరూర్‌లోని సెయింట్ ఆగస్టీన్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యను అభ్యసించారు. ఆ తర్వాత కొల్లంలోని టీకేఎం కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఇస్రో ఛైర్మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం ఆయన సారథ్యంలోనే జరిగింది.

## హైడ్రా పరిధి ఖరారు

హైదరాబాద్,జూలై 19 : ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్) విధివిధానాలను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. జీహెచ్ఎంసీతోపాటు ఓఆర్ఆర్ వరకు హైడ్రాకు అధికార పరిధిని అప్పగించింది. హైడ్రా ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరించనున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మంత్రులు, సీఎస్, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రెటరీ, జీహెచ్ఎంసీ మేయర్ సభ్యులుగా ఉంటారు.

## రాజీనామాపై నాలుక మడతేసిన హరీష్ రావు

**కాంగ్రెస్ ఎంపీల ఫోరం ఛైర్మన్ మల్లు రవి**

హైదరాబాద్,జూలై 19 : రైతు రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పుడు.. మాట మారుస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం ఛైర్మన్ మల్లు రవి, ఎంపీలు బలరాం నాయక్, రఘురాంరెడ్డిలు ఆరోపించారు. రాజీనామా చేయకుండా తప్పించుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ మాట ఇచ్చింది అంటే.. చేసి తీరుతామని నిన్నటి ఘటనతో ప్రతిపక్షాలకు తెలిసొచ్చిందన్నారు. ఏక కాలంలో రూ.31వేల కోట్ల రుణ మాఫీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. ఇంత పెద్ద మొత్తంలో రైతులకు రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ఎంపీల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఇక గుజరాత్ మోడల్ లేదని, అంతా తెలంగాణ మోడల్‌ను అనుసరించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. పదేళ్లలో భారాస చేయలేని పనిని తమ ప్రభుత్వం ఏడు నెలల్లోనే చేసి చూపించిందన్నారు.

## ఎమ్మెల్యే పాయల శంకర్‌కు సన్మానం

ఆదిలాబాద్,జూలై 19 : భాజపా జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. శాసనసభ ఎన్నికల తర్వాత జరిగిన తొలి సమావేశం కావడంతో ఎమ్మెల్యేతోపాటు నూతన జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్రాల నగేష్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆదినాథ్, వేణుగోపాల్, మురళీధర్, మయూర చంద్ర, విజయ్ బోయర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో మొత్తం 545 దరఖాస్తులు రాక

**దరఖాస్తులను స్వీకరించిన చిన్నారెడ్డి**



హైదరాబాద్,జూలై19 : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 545 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 95 , పౌరసరఫరాల శాఖ కు సంబంధించి 84 , విద్యుత్ శాఖ కు సంబంధించి 82, హౌజింగ్ కు సంబంధించి 79 దరఖాస్తులు, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కు సంబంధించి 47, ఇతర శాఖలకు సంబంధించి 158 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## 8కోట్ల ఉద్యోగాల సృష్టి..మరో ట్రాష్

**ప్రధాని మోడీ ప్రకటనపై ఖర్గే మండిపాటు**

న్యూఢిల్లీ,జూలై 19 : ఎనిమిది కోట్ల ఉద్యోగాలు సృష్టించామన్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటనను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం తీవ్రంగా విమర్శించారు. ప్రధాని మోడీ 'ఒకదాని తరువాత ఒకటిగా అబద్ధం చెప్పడం' ద్వారా యువత 'పుండుపై కారం చల్లుతున్నారు' అని ఖర్గే ఆరోపించారు. గడచిన మూడు నాలుగు సంవత్సరాల్లో ఎనిమిది కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించడం నిరుద్యోగితపై తప్పుడు కథనాలు వ్యాప్తి చేసేవారి నోళ్లు 'మూతపడ్డాయి' అని ప్రధాని మోడీ క్రితం వారం ఉద్ఘాటించిన నేపథ్యంలో ఖర్గే ఈ విమర్శ చేశారు. ఉపాధి కల్పనపై ఆర్‌బిఐ ఇటీవల విడుదల చేసిన నివేదికను ప్రధాని ఉటంకిస్తూ, ఎన్‌డిఎ ప్రభుత్వం సుస్థిరత, వృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని నొక్కిచెప్పారు.
చిన్న, పెద్ద స్థాయి మదుపరులు ఎన్‌డిఎ మూడవ హయాంను ఎంతో ఉత్సాహంతో స్వాగతించారని ఆయన తెలిపారు. 'నరేంద్ర మోడీజీ! ఉద్యోగాలపై ఒకదాని తరువాత ఒకటిగా అబద్దాలు చెబుతూ మీరు యువత పుండ్లపై కారం చల్లుతున్నారు' అని ఖర్గే 'ఎక్స్' పోస్ట్‌లో విమర్శించారు. 'అందుకే ఆర్‌బిఐ ప్రశ్నార్థక డేటాపై మిమ్మల్ని ప్రశ్నించాలని మేము అనుకుంటున్నాం/ మీరు పది సంవత్సరాల్లో 20 కోట్ల ఉద్యోగాలు వాగ్దానం చేసి 12 కోట్లకు పైగా ఉద్యోగాలను ఎందుకు పరిహరించారు?' అని ఖర్గే తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆర్‌బిఐ నివేదికకు ఆధారమైన ప్రభుత్వ పిఎల్‌ఎఫ్‌ఎస్ డేటా ప్రకారం పని చేసే మహిళల్లో 37 శాతం మందికి వేతనాల చెల్లింపులు జరగలేదన్నది నిజం కాదా అని ఖర్గే అడిగారు.

## మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యలు

**విమానర సర్వీసలకు తీవ్ర అంతరాయం**

**ప్రయాణికులకు నీళ్లు, ఆహార సేవలు అందించాలి**

**అధికారులకు మంత్రి రామ్మోమన్ నాయుడు ఆదేశం**

న్యూఢిల్లీ,జూలై 19 : మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యల కారణంగా విమాన సేవలు ప్రభావితమయ్యాయి. చాలా కంపెనీల విమానాలు ఎగరలేకపోతున్నాయి. భారతదేశంలో, ఢిల్లీ, ముంబై మరియు బెంగళూరు విమానాశ్రయాలలో విమానాలు షెడ్యూల్ కంటే ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ సాంకేతిక సమస్యల తర్వాత భారత ప్రభుత్వం మైక్రోసాఫ్ట్‌ను సంప్రదించింది. అనేక దేశాల ప్రభుత్వాలు అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేశాయి. స్పైస్‌జెట్, ఇండిగో,అకాసా ఎయిర్‌లైన్స్ కూడా ఇలాంటి సాంకేతిక సమస్యలను ఉదహరించాయి. ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు సర్వర్ సమస్యల కారణంగా సర్వీసులు నిలిచిపోయాయని చెబుతున్నాయి. తాజాగా ఈ సమస్య పరిష్కారమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సమస్య వల్ల విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ అంశంపై తాజాగా పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అంతరాయం వల్ల ప్రభావితమైన ప్రయాణికులకు నీరు, ఆహారం అందిస్తుందని మంత్రి తెలిపారు.
ప్రయాణికుల పట్ల విమానాశ్రయ అధికారులు, విమానయాన సంస్థలు సానుభూతితో వ్యవహరించాలి. విమాన సర్వీసుల ఆలస్యం కారణంగా ప్రయాణికులకు అదనపు సీటింగ్, వాటర్, ఆహారాన్ని తప్పక అందించాలి. ప్రయాణీకుల సురక్షిత ప్రయాణం కోసం టెక్నికల్ టీమ్ కృషి చేస్తోంది. ఇలాంటి సమయాల్లో ప్రయాణీకుల సహకారం కూడా తప్పకుండా అవసరం. టెక్నికల్ సమస్య, విమాన సర్వీసుల రాకపోకలపై ఎలాంటి అప్‌డేట్ ఉన్నా ప్రయాణీకులకు వెంటనే తెలియజేయాలి. విమానాశ్రయాల్లో ప్రయాణీకుల అవసరాల కోసం అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశాం. మైక్రోసాఫ్ట్ సంస్థతో అధికారులు టచ్‌లోనే ఉన్నారు. వీలైనంత త్వరగా మామూలు పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు.

## కాంగ్రెస్ రుణమాఫీతో వారికి నిద్రపట్టడం లేదు

**బిఆర్ఎస్, బిజెపి నేతలు విమర్శలకు పనికి వస్తారు**

**కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఘాటు వ్యాఖ్యలు**

హైదరాబాద్,జూలై 19 : కాంగ్రెస్ ప్రాక్టికల్ పార్టీ.. కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రుణమాఫీ చేశారని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి అన్నారు. సోనియా గాంధీ, రాహూల్ బటన్ నొక్కితే సీఎం రేవంత్ రుణమాఫీ చేశారన్నారు. సినిమాల్లో రైతుల గురించి చూపించి డబ్బులు సంపాదించిన చిరంజీవి.. నల్లచట్టాల గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. నల్ల చట్టాలు తెచ్చిన మోడీకి మద్దతు ఇచ్చి.. రైతులకు అండగా ఉన్న రాహుల్ గాంధీకి మద్దతు ఎందుకు ఇవ్వలేదని అన్నారు. రుణమాఫీ చూసి బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టి ఉండదని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కేటీఆర్‌కు ట్విట్టర్ పని తప్పా.. పనికి పనికిరాదని విమర్శించారు. మరోవైపు.. బీజేపీ దగ్గర పనితనమే లేదు.. మాటలు తప్పితే అని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. బీజేపీ రైతులను కుని చేసి మర్డర్ చేసింది.. రైతులను నల్ల చట్టాలతో హత్య చేశారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నేతల పిల్లలు రైతుల మీద నుండి కార్లు తీసుకు పోయారు.. దీని మీద కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడగలరా అని ప్రశ్నించారు. ఎండనక.. వాన అనక రైతులు ధర్నా చేస్త బీజేపీ నేతలు చంపలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరంజీవి ఖైదీ నెంబర్ 150 సినిమా రైతుల మీద తీశారు.. రైతులు ఆత్మహత్య చేసుకోవడం పై తీశారు..

## కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో సి ఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



భువనగిరి ,జూలై19(రోమింగ్ న్యూస్) : రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మొదటి విడత మాఫీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి పిట్టల బాలరాజ్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి గంజ్ లో శుక్రవారం సి ఎం, ఎంపి, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ జనరల్ సెక్రెటరీ పోత్నక్ ప్రమోద్ కుమార్, టీపీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవి కుమార్, మాజీ ఛైర్మన్ బర్రె జాంగిర్, భువనగిరి అసెంబ్లీ ఇంచార్జ్ ఎండి వజిత్, భువనగిరి పట్టణ ఇంచార్జ్ సోమ రవీందర్ రెడ్డి, భువనగిరి పట్టణ అధ్యక్షులు డాకూరిప్రకాష్, మండల కార్యదర్శి గోమారి ఎల్లారెడ్డి, ఎండి అమిత్, పి చంద్రశేఖర్, అర్బన్ కాలనీ వీరేకర్ శ్రీనివాస్, మహంకాళి సురేష్, జాంగిర్, బాబా, ఒగ్గ రమేష్, బర్ల ఉప్పలయ్య, తల్లూరి నరసింహ, రైతులు నాయకులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదాన పథకానికి విరాళం



శ్రీశైలం, జూలై 19 ( రోమింగ్ న్యూస్. ) అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం రూ.1,01,116/-లను శ్రీ కె. రామకోటిరెడ్డిగారు, విజయవాడ వారు అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు జి. రవికి అందజేయడం జరిగింది. వారికి శ్రీ స్వామి అమ్మవార్ల శేష వస్త్రములు మరియు తీర్థ ప్రసాదములు అందజేయడమైనది.

## శ్రీశైలంలోఅంకాళమ్మ అమ్మవారికి బోనం సమర్పణ



శ్రీశైలం ,జూలై 19 ( రోమింగ్ న్యూస్ ) : మూలా నక్షత్రం సందర్భంగా లోకకల్యాణం కోసం ఈ రోజు (19.07.2024) శ్రీశైల మహాక్షేత్ర గ్రామ దేవత అయిన శ్రీ అంకాళమ్మ వారికి దేవస్థానం తరుపున బోనం సమర్పించబడింది. ఈ సందర్భంగా అంకాళమ్మ అమ్మవారికి విశేషంగా పూజాదికాలు జరిపించబడ్డాయి.
ఈ ఉదయం ఆలయ మహాద్వారం నుంచి స్వామివారి ప్రధానార్చకులు హెచ్. వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు ఎం. ఉమానాగేశ్వరశాస్త్రి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు పలువురు అర్చకస్వాములు, వేదపండితులు సంప్రదాయ బద్ధంగా నూతన పట్టువస్త్రాలు, పసుపుకుంకుమలు, గాజులు, ఫలపుష్పాలు, నివేదన మొదలైనవాటితో అంకాళమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. తరువాత అంకాళమ్మ అమ్మవారికి విశేషంగా పూజాదికాలు జరిపి బోనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముందుగా సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, అతివృష్టి, అనావృష్టి నివారించబడాలని, అగ్నిప్రమాదాలు, వాహనప్రమాదాలు మొదలైనవి నిరోధించబడాలని, రోగకారక పరిస్థితులు రాకుండా ఉండాలని, జనులందరికి ఆయురారోగ్యాలు చేకూరాని, జనులందరికీ సుఖసంతోషాలు కలగాలని, అందరికీ ఆయురారోగ్యాలు చేకూరాని ఈ సంకల్పములో చెప్పబడింది.తరువాత అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజాదికాలతో బోనం సమర్పించబడింది.



## ఆపదలో ఉన్న వారిని ఆదుకునే వ్యక్తి రాకల శ్రీనివాస్

భువనగిరి ,జూలై19(రోమింగ్ న్యూస్) : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరు గుండె చప్పుడులా వాళ్ళ బాధలు తీర్చి కన్నీళ్లు తుడిచే దాయాహృదయులు ర్యాకల శ్రీనివాస్ అని శ్రీనివాస్ అభిమాని బత్క అశోక్ అన్నారు. ఆయన సేవా కార్యక్రమలు గుర్తించి డాక్టరేట్ ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో ఇంకా ఎన్నో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

## విద్యుత్ షాక్ తో మూడు గేదెలు మృతి



భువనగిరి ,జూలై19(రోమింగ్ న్యూస్) : పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో కట్ల యాదగిరికి చెందిన మూడు గేదెలు విద్యుత్ షాక్ తో మృతి చెందాయి. రైతు కట్ల యాదగిరి మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల సుమారు 3 లక్షల రూపాయల విలువగల గేదెలు మృతిచెందాయని తెలిపారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 20
జూలై 2024





# కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్,జూలై 19 : కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అర్హులైన కార్మికుల పిల్లలకు 2024-25 ఏడాదికి గాను స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీడీ కార్మికులు, సినీ కార్మికులు, లైమ్‌స్టోన్, డోలోమైట్, మైకా, ఐరన్‌ఓర్, మాంసనీస్ ఓర్, క్రోమ్ ఓర్ కార్మికుల పిల్లల నుంచి దరఖాస్తులు కోరారు. 1వ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31 లోపు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే ఇంటర్ నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కోరారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను, 01206619540 హెల్ప్‌లైన్ నంబర్, ర।టూ।బీఅనిబూ.ఙనీల.తినికు మెయిల్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

# ఆగివున్న లారీని ఢీకొన్న కారు

## ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థుల దుర్మరణం

హైదరాబాద్,జూలై 19 : హైదరాబాద్ దుండిగల్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓఆర్ఆర్ ఎగ్జిట్ 5 దగ్గర రోడ్డుపై ఆగి ఉన్న లారీని స్కోడా కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో వీఎన్ఆర్ కాలేజీకి చెందిన ముగ్గురు బీటెక్ విద్యార్థులు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కారు కుత్బుల్లాపూర్ నుంచి దుండిగల్ వెళు ండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో కాసేపు రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు గాయపడిన వారిని స్థానిక మల్లారెడ్డి హస్పిటల్ కు తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతదేహాలను పోస్టు మార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు అతి వేగమే ప్రమాదానికి కారణం అని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# పాతబస్తీ బోనాలకు పటిష్ట భద్రత

## నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్,జూలై 19 : పాత బస్తీలో జరిగే బోనాలకు వెయ్యి మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం, అక్కన్న మాదన్న దేవాలయాలను ఆయన శుక్రవారం సందర్శించారు. అనవాయితీగా వస్తున్న ఆయల శిఖర పూజ, ధ్వజారోహన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుని కోరుకున్నానని, శిఖర పూజలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సౌత్‌జోన్ డీసీపీ స్నేహ మెహ్రా ట్రాఫిక్ డీసీపీ ఆర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా ఛైర్మన్‌గా సిఎం రేవంత్ రెడ్డి

## హైడ్రా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్,జూలై 19 : ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు,విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా( హైదరాబాద్ డిజాస్టర్, రెస్పాన్స్ అండ్ అసెట్స్) ఛైర్మన్ గా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరించ నున్నారు. సభ్యులుగా రెవెన్యూ మంత్రి ఉమ్మడి రంగారెడ్డి ,హైదరాబాద్ మంత్రులు వీరితో పాటు సీఎస్, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రటరీ జీహెచ్‌ఎంసీ మేయర్ ఉండనున్నారు. ఈ మేరకు పరభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీతో పాటు ఓఆర్ఆర్ వరకు ఆస్తుల పరిరక్షణ, విప్తతు సంరక్షణపై పనిచేయనుంది హైడ్రా. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా)ను బలమైన వ్యవస్థగా తీర్చిదిద్దాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం సర్కార్ హైడ్రాను ఏర్పాటు చేసింది. ఇంతకుముందు ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ విభాగం పేరును హైడ్రాగా మార్చి కీలక బాధ్యతలు అప్పగించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలను కాపాడుతూ అక్రమ నిర్మాణాలకు చెక్?పెట్టేందుకు హైడ్రా పనిచేస్తుంది. ఈ వింగ్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ యాక్ట్ పరిధిలోనే పని చేస్తుందని తెలిపారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డు, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుత్, పోలీస్ విభాగాలను సమన్వయం చేసుకుంటూ హైడ్రా పని చేయాలని.. అందుకు తగ్గట్టు దాని వ్యవస్థాగత నిర్మాణం, విధివిధానాలు ఉండాలని సూచించారు.

# స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీ

## ముసాయిదా సిద్దం చేయాలని సిఎం ఆదేశం

హైదరాబాద్,జూలై 19 : ఢిల్లీ, హర్యానా తరహాలో స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముసాయిదా సిద్ధం చేయాలని సూచించారు సీఎం రేవంత్ రెడ్డి. సెక్రటేరియేట్ లో స్కిల్ వర్సిటీ అధికారులతో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క సుదీర్ఘంగా చర్చించారు. ముసాయిదాలోని అంశాలపై పలు సూచనలు జారీ చేశారు. యూనివర్సిటీల్లో సర్టిఫికెట్ కోర్సులు, డిప్లొమా కోర్సులకు సంబంధించి..సీఎం, డిప్యూటీ సీఎంలకు వివరించారు అధికారులు. కోర్సుల విషయంలో డిమాండ్ ఎక్కువగా ఉన్న రంగాలపై దృష్టిపెట్టాలన్నారు రేవంత్ రెడ్డి. శిక్షణ పూర్తైన విద్యార్థులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి కంపెనీలతో ముందుగానే మాట్లాడాలని సూచించారు. స్కిల్ వర్సిటీ విషయంలో రాజీపడొద్దన్న రేవంత్.. పూర్తిస్థాయి ముసాయిదాను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఇంజినీరింగ్ తొలి విడత సీట్ల కేటాయింపు

హైదరాబాద్,జూలై 19 : తెలంగాణలో ఇంజినీరింగ్ తొలి విడత సీట్ల కేటాయింపు జరిగింది. వెబ్‌సైట్‌లో విద్యార్థులకు అలాట్‌మెంట్ ఆర్డర్లు అందుబాటులో ఉన్నాయి. 96 వేల మందికి పైగా విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. కన్వీనర్ కోటాలో 72,741 ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

క్యాండిడేట్ లాగిన్ ద్వారా సీటు అలాట్‌మెంట్ ఆర్డర్ కాపీని పొందొచ్చు. లాగిన్ ఐడీ, ఎప్‌సెట్ హాల్ టికెట్ నంబర్, పాస్‌వర్డ్, డేట్ ఆఫ్ బర్త్ ద్వారా ఏ కాలేజీలో సీటు వచ్చిందో తెలుసుకోవచ్చు. సీటు అలాట్‌మెంట్ కోసం వెబ్‌సైట్ లాగిన్ కావొచ్చు. నిరుడు ఎప్‌సెట్‌లో కన్వీనర్ కోటాలో 83,766 సీట్లు భర్తీచేశారు. ఈ ఏడాది వీటి సంఖ్య 72,741కి పడిపోయింది. కన్వీనర్, మేనేజ్‌మెంట్ నిరుడు 1.10 లక్షల సీట్లు ఉంటే, ఈ ఏడాది 1.01 లక్షల సీట్లకే పరిమితమయ్యాయి. ఇవి ఇప్పట్లో అందుబాటులోకి వస్తాయా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 11 వేల సీట్ల విషయం పెండింగ్‌లో ఉండగానే తాజాగా సర్కారు కొత్తగా ఐదు కాలేజీల్లోని కొత్త కోర్సుల్లో 3,365 సీట్లకు అనుమతినిచ్చింది. సీవీఆర్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ), ఐటీ కోర్సులు, స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్, తీగల కృష్ణారెడ్డి కాలేజీలో సీఎస్ఈ(ఏఐఎంఎల్), సీఎస్ఈ డాటా సైన్స్ కోర్సులకు అనుమతినిచ్చింది. వీటితో సీట్ల సంఖ్య 1,01,661కి చేరగా, ఇందులో కన్వీనర్ కోటా 72,741 ఉన్నాయి. సీట్ల తగ్గింపు విషయమై అధికారులను ఆరా తీయగా సీట్ల కన్వర్షన్ కోసం సర్కారు అనుమతి కోరినట్టు తెలిపారు.

# ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ

## సిఎం రేవంత్ చిత్రపటానికి లాయర్ల క్షీరాభిషేకం

హైదరాబాద్,జూలై 19 : తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ పథకానికి గురువారం శ్రీకారం చుట్టింది. రూ.2 లక్షల లోపు బ్యాంకు రుణాలున్న రైతులకు ఏక మొత్తంలో మాఫీ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాటను నిలబెట్టుకున్నారు. అనుకున్న దానికంటే ముందే మొదటి విడత రుణమాఫీ నగదును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఎన్నికల హామీలో భాగంగా రైతులకు రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు బషీర్‌బాగ్ చౌరస్తాలో హైకోర్టు న్యాయవాదులు క్షీరాభిషేకాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ నగదు జమ చేయడంతో సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జేఏసీ కోఆర్డినేటర్ వెంకటేష్ ఇంద్రపల్లి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటోకి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేస్తున్నందుకుగాను సీఎం రేవంత్ రెడ్డికి, హైకోర్టు అడ్వకేట్లు, సామాజిక కార్యకర్తలు, ఉద్యమకారులు కలిసి రేవంత్ ఫొటోకి పాలాభిషేకం చేశారు. ఇది ప్రజల ప్రభుత్వం, రైతు ప్రభుత్వం అంటూ రేవంత్ రెడ్డికి న్యాయవాదులు జేజేలు కొడుతూ కొనియాడారు. అయితే.. రూ.2 లక్షల లోపు బ్యాంకు రుణాలున్న రైతులకు ఏక మొత్తంలో మాఫీ చేస్తామన్న ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకుంది. అనుకున్న దానికంటే ముందే మొదటి విడుత రుణమాఫీ నగదును గురువారం రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్య కాలంలో తీసుకున్న రుణాల మాఫీకి రేవంత్ సర్కారు కట్టుబడింది. ఆగస్టు 15వ తేదీలోపు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామన్న ఇప్పటికే ప్రకటించగా, ఆ దిశగా మొదటి అడుగు వేసింది. సర్కారు చొరవతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది.

# బీసీ జనగణన తరవాతే పంచాయతీ ఎన్నికలు

### నాలుగు గోడల మధ్య నిర్ణయాలు తీసుకోం

### బిఆర్ఎస్ చచ్చిన పాముతో సమానం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



కరీంనగర్,జూలై 19 : బీసీ జనగణన అనంతరం తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాలుగు గోడల మధ్య తాము ఏ నిర్ణయాలు తీసుకోవడం లేదని, తమది ప్రజా ప్రభుత్వమని తెలంగాణ రెవెన్యూ,గృహ నిర్మాణం శాఖల మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రజల మధ్యలో వారి అభిప్రాయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలిస్తుందని క్లారిటీ ఇచ్చారు. గత ప్రభుత్వం కేంద్రంతో భేషజాలకు పోవడంతో తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లిందన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇస్తున్నట్లే, తెలంగాణకు సైతం న్యాయంగా రావాల్సిన నిధులను సక్రమంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని తాము కోరుతున్నామని పొంగులేటి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నామ మాత్రంగా కూడా మిగిలే ప్రసక్తేలేదని, గులాబీ పార్టీ పేకమేడలా కూలిపోతుందని.. వారే కూల్చుకుం టున్నారని మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు అధికారం ఇచ్చే పరిపాలన మీద ఫోకస్ చేయాలని కానీ, ప్రతిపక్ష నేతలు, లాయర్లు, జడ్జీలు, సినీ సెలబ్రిటీలు, రియల్ ఎస్టేట్ సంబంధించిన వారి వ్యక్తిగత విషయాలు తెలుసుకునేందకు ఫోన్ ట్యాపింగ్ లాంటి అంశాలపై ఫోకస్ చేశారంటూ మండిపడ్డారు. వేలకోట్లతో నిర్మించినా కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని, త్వరలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ అన్ని కుట్రల్ని ప్రజలకు అర్థమయ్యేలా చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిన పాము అని, ఇంకా చంపాలని తాము అనుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాలను దిగమింగు కోలేక చెప్పాల్సి వస్తుందన్నారు. ధరణి పేరుతో రైతులు, పేదల భూములు ఇష్టారాజ్యంగా దోచుకున్నారు. ధరణి చట్టాన్ని సవరించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. బీఆర్ఎస్ మంచి చేస్తే మంచి అని చెబుతాం, కానీ వారి చెడును కూడా ప్రజలకు చూపించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వేల కోట్ల ప్రజల సొమ్మును కేసీఆర్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. నాలుగు గోడల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోదని, తమది ప్రజా ప్రభుత్వం కనుక, వారి అభిప్రాయాలకు అనుగుణంగా పాలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో బీసీ జనగణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ధనిక రాష్ట్రం అని బయటకి గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష కోట్లు అప్పులు ఎందుకు చేసిందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సాయం అడిగితే నామోషీ అని మిషన్ భగీరథ లాంటి వాటికి గత ప్రభుత్వం నిధులు అడగలేదని చెప్పారు. తామెంతో చేశామని కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లు గొప్పలు చెప్పిన మిషన్ భగీరథ పథకం నీళ్లు రాష్ట్రంలో ఇంకా 30 శాతం మందికి చేరలేదని పేర్కొన్నారు.

### కెసిఆర్ హయాంలో ఆర్థిక విధ్వంసం

### ఏడు లక్షల కోట్ల అప్పు నెత్తిన పెట్టిన ఘనుడు

### అరచాక పాలన సాగించిన కెసిఆర్: పొంగులేటి

కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లలో కేంద్రం నుంచి సరైన నిధులు తేలేకపోయారని ఎద్దేవా చేశారు. జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కేసీఆర్ పదేళ్ల పాలనపై ధ్వజమెత్తారు. టీఆర్ఎస్‌ను జాతీయ పార్టీ అని చెప్పి బీఆర్ఎస్ గా పేరు మార్చి పక్క రాష్ట్రాలతో గొడవలు పెట్టుకున్నారన్నారు. ధనిక తెలంగాణను అప్పుల పాలు చేశారని, ఏడు లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నో అరాచకాలను కేసీఆర్ పాల్పడ్డారని దుయ్యబట్టారు. ఫోన్ ట్యాపింగ్ తో పాటు ఇరిగేషన్, విద్యుత్ సంస్థల్లో కేసీఆర్ అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. బీఆర్ఎస్ చేసిన తప్పులకు వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. బీఆర్ఎస్ త్వరలోనే పేకమేడ లాగా కూలిపోతుందన్నారు. రైతుబంధు నిధులను రుణమాఫీ కోసం వాడామని బీఆర్ఎస్ నేతలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రైతు భరోసా రైతులకు ఇచ్చి తీరుతామని చెప్పారు. ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. కేసీఆర్ లాగా రుణమాఫీకి పదేళ్ల సమయం తీసుకోలేదని.. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రుణమాఫీ చేశామని తెలిపారు. వాస్తవాలను బిఆర్ఎస్ నేతలు ఇంకా ఒప్పుకోవడం లేదని, కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకుల మాదిరి గొప్పలకు వెళ్లడం లేదని ఉద్ఘాటించారు.బీఆర్ఎస్ చేసిన తప్పులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. తాము గులాబీ పార్టీ లాగా గొప్పలకు వెళ్లడం లేదని స్పష్టం చేశారు. ధనిక తెలంగాణను గత సర్కార్ అప్పుల పాలు చేసిందని మండిపడ్డారు. రూ. 7 లక్షల కోట్ల అప్పు చేసి పోయారని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాప్, ఇరిగేషన్, కరెంట్‌తో అరాచకాలు చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ మార్గదర్శకాలపై ప్రతిపక్షాలు చేసే విమర్శలు నమ్మొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రైతులను ఆందోళనకు గురిచేసేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కుటుంబ నిర్ధారణకు మాత్రమే రేషన్ కార్డు ప్రమాణికమని తెలిపారు. రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డు పేరుతో ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య శ్రీ, రేషన్ కార్డులు వేర్వేరుగా ఇస్తామని తెలిపారు. ఒకదానితో ఒకటి లింక్ పెట్టబోమని అన్నారు. కొత్త రేషన్ కార్డులకు మార్గదర్శకాలు ఆలోచిస్తున్నామని వివరించారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏం చేయాలో అర్థం కావడం లేదని అన్నారు. తాము రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేస్తున్నామని ప్రకటించారు.కేసీఆర్ చేసింది పదేళ్లల్లో 25 వేల కోట్ల రుణమాఫీ మాత్రమేనని అన్నారు.

# ఇరు తెలుగు రాష్ట్రాల అధికారుల నిర్లక్ష్యం

### నిధుల కేటాయింపులో ముందుకు రాని ప్రభుత్వాలు

### పెద్దవాగు కట్ట తెగడంతో భారీగా నష్టం

ఖమ్మం,జూలై 19 : ఖమ్మం జిల్లాలో పెద్దవాగు ప్రాజెక్టు భద్రత, నిర్వహణ విషయంలో గోదావరి బోర్డు చాలా రోజులుగా అప్రమత్తం చేస్తూన్నా నాటి ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు పెద్ద విపత్తే జరిగింది. వాగు కట్ట తెగి పోవడంతో నీరు కిందికి పోవడంతో పాటు భారీ నష్టం వాటిల్లింది. పూర్తిస్థాయి మరమ్మతులు, ఆధునికీకరణకు నిధులు కేటాయించాలంటూ పలుమార్లు లేఖలు రాసినా ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి జగన్ ప్రభుత్వం పూర్తిగా పెడచెవిన పెట్టింది. నేడు 14 గ్రామాల ప్రజల జలదిగ్బంధానికి కారణమైంది. పూర్తిస్థాయిలో ఆధునికీకరణకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. తెలంగాణ, ఏపీలు 15:85 నిష్పత్తిలో నిధులు కేటాయించాలని గోదావరి బోర్డు సమావేశాల్లో పలుమార్లు చర్చకు వచ్చింది. 2021 ఫిబ్రవరిలో రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయినా ముందడుగు పడలేదు. సంబంధిత దస్త్రాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆమోదించినా, ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి వైకాపా సర్కారు పెడచెవిన పెట్టింది. గతేడాది తెలంగాణ ప్రభుత్వం రూ.2కోట్లతో కొత్త క్రస్ట్‌గేట్లను అమర్చింది. వాటికి ఏటా గ్రీజు పెట్టకపోవటం, గేట్లు సరిగ్గా ఉన్నాయా లేదో ముందస్తుగా పరిశీలించకపోవడంతో ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి ఒకటిన జరిగిన బోర్డు సమావేశంలోనూ రెండు రాష్ట్రాలు ఉమ్మడి సమావేశం నిర్వహించి పెద్దవాగు ప్రాజెక్టు నిర్వహణపై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించాయి. అంతలోనే వరదలకు ఆనకట్టకు గండిపడింది. తెలంగాణ, ఏపీల నుంచి గోదావరి బోర్డు పరిధిలోకి వచ్చిన ఉమ్మడి ప్రాజెక్టుల్లో ఇదొకటి. పశ్చిమగోదావరి జిల్లాలో పుట్టే పెద్దవాగు... భద్రాద్రి జిల్లాలోకి ప్రవేశించి... తిరిగి ఏపీలోకి వెళుతుంది. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లిలో ఈ వాగుపై 1977-78లో నాటి సీఎం జలగం వెంగళరావు హయాంలో రూ.1.50 కోట్లతో మూడు క్రస్టు గేట్లు, రెండు తూములతో ప్రాజెక్టును నిర్మించారు. నీటి నిల్వ సామర్థ్యం 0.50 టీఎంసీలు. తెలంగాణలోని భద్రాద్రి జిల్లా పరిధిలో 2,700 ఎకరాల ఆయకట్టుకు, ఏపీలోని వేలేరుపాడు మండలానికి కుడి కాలువ, కుక్కునూరు మండలానికి ఎడమ కాలువ కింద నీళ్లు పారుతాయి. రెండు కాలువల కింద 13,300 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు మూడు గేట్లలో ఒకటి పని చేయకపోవడంతో 1989లో కట్టకు భారీగండి పడింది. అప్పట్లో ఏపీలోని కమ్మరిగూడెం కొట్టుకుపోయింది. అల్లూరినగర్, ఒంటిబండ, వసంతవాడ గ్రామాలు దెబ్బతిన్నాయి. అప్పట్లో గండిపడిన చోటే క్రస్ట్ గేట్ల భాగం పక్కనే రమణక్కపేట వైపు మరోసారి గురువారం గండిపడింది. 1998లో అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో రూ.15 కోట్లతో మరమ్మతు చేశారు.

# పెద్దవాగుకు భారీ గండి

### వరద ఉధృతికి కొట్టుకుపోయిన పశువులు

### కొండలు, గుట్టలపై తలదాచుకున్న ప్రలు

### భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

### చర్ల వద్ద తాపేరుకు వరద ఉధృతి

### అధికారులను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

భద్రాద్రి కొత్తగూడెం,జూలై19 : భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో పెద్దవాగు ప్రాజెక్టుకు గురువారం రాత్రి భారీ గండి పడింది. దీంతో నీళ్లన్నీ దిగువకు వెళ్లడంతో ప్రాజెక్టు ఖాళీ అయింది.



ప్రాజెక్టు కట్ట తెగి వందల సంఖ్యలో పశువులు కొట్టుకుపోయాయి. వరద ప్రవాహానికి వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. పలు గ్రామాల ప్రజలు కొండలు, ఎత్తయిన భవనాల్లో రాత్రంతా తలదాచుకున్నారు. ఏం జరుగుతుందో తెలియక పరుగులు తీశారు. గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో సహాయక చర్యలకు వీలు లేకుండా పోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరడంతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గురువారం 20 అడుగులు వద్ద ఉన్న వరద.. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి 24.5 అడుగులకు చేరింది. గోదావరికి ఎగువ ప్రాంతంలో ఉన్న పేరూరులో ఉదయం 9 గంటలకు 40.86 అడుగులు నమోదైంది. ఇంద్రావతి, పేరూరు వైపు నుంచి వరద భద్రాచలం గుండా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో భద్రాచలంలో ప్రమాద స్థాయికి వరద చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 43 అడుగులు వరద వస్తే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. 48 అడుగులకు వస్తే రెండు, 53 అడుగులకు వస్తే మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. గోదావరి ప్రాంతంలో వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సెక్టోరియల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గజ ఈతగాళ్లు, పడవలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపుచర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న చత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో శుక్రవారం 24 గేట్లు ఎత్తి 59 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువన గోదావరికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 60,297 క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో వస్తోంది. ప్రాజెక్టులో క్రమేపీ వరద ఉధృతి పెరుగుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ ఉపేందర్ తెలిపారు. మరో పక్క చింతవాగు, పగిడి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దక్షిణ, ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనం గా మారింది. రానున్న 12 గంటల్లో ఇది వాయుగుండంగా మారే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. హైదరాబాద్‌లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

# అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు

### తెలంగాణలో పలు జిల్లాల్లో భారీగా వానలు

### విశాఖ జిల్లాను వదలని వర్షాలు

హైదరాబాద్/విశాఖపట్టణం,జూలై 19 : తీవ్ర అల్పపీడనం వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల 24 గంటల్లో ఒడిశాలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొంది. వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, తెలంగాణపై దీని ప్రభావం ఇవాళ, రేపు ఎక్కువగా ఉంటుందని ప్రకటించింది. విస్తారంగా వర్షాలతో పాటు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈశాన్య, తూర్పు జిల్లాలైన కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. శనివారం ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురవొచ్చు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదారాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. అల్పపీడనం ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, రామకృష్ణా థియేటర్ రోడ్డు, వెలమ వీధి, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. జ్ఞానాపురం పాతవంతెన వద్ద వరదనీరు నిలిచిపోయింది. విశాఖ ఆర్‌అండ్‌బీ కార్యాలయం నుంచి బిర్లా వరకు సర్వీసు రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. కార్యాలయాలు, పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోకాళ్ల లోతు నీటిలో వాహనాలు నడుపుతూ అవస్థలు పడ్డారు. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.

# బిల్కిస్ బానో కేసులో దోషులకు షాక్

## బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ,జూలై 19 : బిల్కిస్ బానో కేసులో ఇద్దరు దోషుల పిటిషన్‌ను సుప్రీం కొట్టివేసింది. రెమిషన్ వచ్చేవరకు తమకు బెయిల్ మంజూరుచేయాల్సిందిగా దోషులు సుప్రీంను ఆశ్రయించారు. కాగా అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఈ పిటిషన్‌ను నిరాకరించింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం దీనిని పూర్తిగా తప్పుడు పిటిషన్‌గా పేర్కొంది. కోర్టులోని ఒక బెంచ్ జారీ చేసిన ఆర్డర్‌పై మరొక బెంచ్ ఎలా అప్పీల్ చేస్తారని ప్రశ్నించింది. కాగా దోషులు రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా, రాజుభాయ్ బాబూలాల్ సోనీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరగా దానికి బెంచ్ అనుమతించింది. షా మధ్యంతర బెయిల్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు.2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో పెద్దఎత్తున చోటుచేసుకున్న మతపరమైన అల్లర్లలో బిల్కిస్ బానో కుటుంబానికి చెందిన ఏడుగురు సభ్యులు హత్యకు గురయ్యారు. 5 నెలల గర్భిణిగా ఉన్న బానోపై దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ కేసులో 11 మంది నిందితులకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2008లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 14 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్నవారికి 2022లో గుజరాత్ ప్రభుత్వం రెమిషన్ మంజూరు చేసింది. దీంతో 2022 ఆగస్టు 15న వారంతా జైలు నుంచి విడుదలయ్యారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 20 జూలై 2024




# వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం

**గిట్టుబాటు ధరలు కూడా కల్పించని కెసిఆర్**

**రైతులకు రుణమాఫీ ఏకకాలంలో చేసిన ఘనత మాదే**

**రాష్ట్రంలో ఆయిల్ పామ్‌కు మంచి అవకాశాలు**

**జిల్లా పర్యటనలో మంత్రులు తుమమల, పొన్నం, శ్రీధర్ బాబు**



పెద్దపల్లి,జూలై 19 : గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గిట్టుబాటు ధర కూడా కల్పించలేదని మండిపడ్డారు. రైతులు కాలర్ ఎగరేసుకున్న రోజు రావాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పెద్దపల్లిలో పర్యటించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు తదితరులు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడతారని అన్నారు. భారతదేశంలో అత్యధికంగా ఆయిల్ ఫామ్ సాగు చేసే రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దేశంలోనే మొదటిసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసింది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశంసించారు. రైతు రు-ణమాఫీ చేయడానికి నాయకత్వం వహించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. భారత దేశ చరిత్రలో మే 6 వ తేది 2022 లో ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో అనంతరం రెడ్డి పంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన రైతుల సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగించారు. ఇది కలనా నిజమా అని రైతులు అనుకుంటున్నారని, గత ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీని నాలుగు, ఐదు విడుతలలో చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీ ఒకసారి తరువాత లక్ష 50 వేలు, తరువాత 2 లక్షల రుణమాఫీ ఒకేసారి జరుగుతుందన్నారు. అయిల్ ఫామ్ కు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉన్న అన్ని ఖర్చులూ పొగ లక్షల్లో ఆదాయం వస్తుందని, ఆయిల్ ఫామ్ లో అంతర పంటలు వేసుకోవచ్చని సూచించారు. 2 లక్షల 103 మెట్రిక్ టన్నుల ఆయిల్ మార్కెట్ జరుగుతుంటే బయటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని, రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల పైన ఆయిల్ ఫాం పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, పెద్దపల్లి జిల్లాలో 45 వేల ఎకరాల్లో ఆయిల్ ఫాం పెట్టడానికి ఇక్కడ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరినీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్త బస్సులకు పెద్ద ఎత్తున డిమాండ్స్ వస్తున్నాయని, చాలా చోట్ల కొత్త బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, రేవంత్ రెడ్డి నాయకత్వంలోమూడు వేలకు పైగా నియామకాలకు ఆదేశాలు జారీ చేశామని, ఇప్పటికే వెయ్యికి పైగా బస్సులు కొనుగోలు చేశామని, మరో 1500 బస్సులు కొనుగోలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్థిక పరిపుష్టి శక్తి రైతన్న దగ్గరే ఉందని, రైతన్నలకు ఆర్థిక శక్తిగా ఎదగాలని, డిసెంబర్ 3 న గెలిచామని, 7 న మంత్రిగా ప్రమాణం చేశానని, 9న ఆర్టీసిలో మహిళలకు ఉచిత బస్సు అందించామని మంత్రి పొన్నం వివరించారు. ఇప్పటి వరకు 62 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేశారని, 2100 కోట్లకు పైగా ఆర్టిసికి ప్రభుత్వం చెల్లించిందని, మహాలక్ష్మి పథకంతో ఆర్టిసి నష్టాలు లేకుండా నడుస్తుందని, పెద్దపల్లిలో ఆర్టిసి బస్సు డిపో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గోదావరి ఖని బస్సు స్టాండ్ రూపురేఖలు మారుస్తామని, ఆర్టిసి ఉ ద్యోగులకు పిఆర్సి ఇచ్చామని, 2013 నాటి పెండింగ్ బాండ్లు చెల్లించామన్నారు.

రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. చెప్పిందే చేస్తాము చేసేదే చెబుతామనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మొదటి విడతలో లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేశామని తెలిపారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు బీఆర్ఎస్ నాయకుల మాటలు ఉన్నాయని విమర్శించారు. రైతు ఆదాయం పెరగడానికి ఆయిల్ ఫామ్ సాగు తోడ్పడుతుందని అన్నారు. రూ.170 కోట్ల వ్యయంతో పెద్దరాత్ పల్లిలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 250 మందికి ప్రత్యేక్షంగా 500మందికి పరోక్షంగా ఉపాధి పొందుతారని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మించి టేలండ్ ప్రాంత రైతులకు నీరు అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# ఒకేసారి రుణమాఫీ హామీ ఏమయ్యింది

**రైతుల్లో ఆందోళన మిగిల్చిన కాంగ్రెస్**

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

హైదరాబాద్,జూలై 19 : రైతులకు కేసీఆర్ ఆనందాన్నిస్తే.. కాంగ్రెస్ ఆందోళన మిగిల్చిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఒకేసారి రుణమాఫీ చేస్తామన్నా హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతుల రుణమాఫీ కోసం రూ.6 వేల కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. రైతులకు కాంగ్రెస్ చేసింది గోరంత.. కొండంతలుగా గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు వివేకానంద, కోవాలక్ష్మితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో మొదటి విడుతలో 35 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్లు చెల్లించామన్నారు. ఆంక్షల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీని కొందరికే పరిమితం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. రైతుభరోసా కింద రైతులకు వెంటనే పెట్టుబడిసాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ నేతల సంబురాల్లో సిద్దిపేట కలెక్టర్ పాల్గొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని
చెప్పారు. వ్యవసాయాన్ని పండుగ చేసింది కేసీఆర్ మాత్రమేనని వెల్లడించారు. రైతుబంధు కింద కేసీఆర్ రూ.70 వేల కోట్లు ఇచ్చారని గుర్తుచేశారు. 3 కోట్ల టన్నుల ధాన్యాన్ని కేసీఆర్ హయాంలో రైతులు పండించారని తెలిపారు. రైతులకు కేసీఆర్ ఆనందాన్నిస్తే.. కాంగ్రెస్ ఆందోళన మిగిల్చిందని విమర్శించారు. కేసీఆర్ కట్టించిన రైతు వేదికల్లో కాంగ్రెస్ సంబురాలు చేసిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులకు బూతులు తప్ప రైతులపై శ్రద్ధలేదని విమర్శించారు. సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి అబద్దాలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వివేకానంద విమర్శించారు. ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నారని చెప్పారు. కేసీఆర్ ఏం చేశారో రైతులకు తెలుసని వెల్లడించారు. కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. రైతు భరోసా ఎందుకు ఇవ్వడం లేదని ఎమ్మెల్యే కోవాలక్ష్మి ప్రశ్నించారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన తర్వాత ప్రభుత్వం నుంచి అభివృద్ధికి ఒక్క పైసా రాలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎంలా వ్యవహరించాలి తప్ప.. పీసీసీ అధ్యక్షుడిగా కాదన్నారు. కేసీఆర్ హయాంలో అందరు ఎమ్మెల్యేలను ఒకేలా చూశారని గుర్తుచేశారు.

# వ్యవసాయానికి అండ కావాలి!

వ్యవసాయానికి అండగా నిలిచి దానిని పండగ చేస్తేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. మనది వ్యవసాయిక దేశం. ఈ విషయాన్ని మరచి పాలకులు వ్యవసాయ అభివృద్ధి ప్రణాళికల విషయంలో పెద్దగా శ్రద్ద చూపడం లేదు. పారిశ్రామిక రంగానికి ఇచ్చిన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. ఈ రంగానికి ప్రోత్సాహం ఇచ్చి, ఆధునీకరస్తే దేశ ఆర్థిక పరిస్థితి మారుతుంది. వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ది చేస్తే ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్త బలపడుతుంది. బడ్జెట్ చర్చల్లో ఎక్కడా వ్యవసానికి పెద్దపీట వేసిన దాఖలాలు లేవు. దేశంలో ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్నా ఇప్పటికీ మనలను కాపాడుతున్నది వ్యవసాయమే. ఈ విషయం గుర్తించ, నిపుణలు సలహాలు తీసుకుని ముందుకు సాగాలి. ఎందుకనో పాలకులు ఎవరు వచ్చినా ఈ దిశగా కృషి చేయడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రకటించిన ప్రధాని మోడీ తన పదేళ్ల కాలంలో వ్యవసాయాభివృద్దికి గట్టి చర్యలు తీసుకోలేదు. రైతులు ఆందోళన చెందుతున్నా పట్టించుకోలేదు. రైతులు ఎవరికి వారు తమ స్వశక్తితో పంటలు పండిస్తూ పోతున్నారు. అప్పులపాలవు తున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అయినా ప్రభుత్వాల్లో కదలిక రావడం లేదు. రైతులకు ఆత్మాభిమానం ఎక్కువ. చేసిన అప్పులు తీర్చలేకపోతే పొలాలు అమ్ముకుని, వ్యవసాయం మానుకోవడం లేదా ఆత్మహత్య చేసుకోవడం చూస్తున్నాం. ఈ పరిస్థితిని మార్చగలిగే పాలకులు రావడం లేదు. ఇకపోతే తెలంగాణలో రైతురుణమాఫీ వల్ల తాత్కాలికంగా రైతులకు ఊరట దక్కనుంది. ఇది శాశ్వత సమస్య పరిష్కారం చూపదు. అలాగే రుణమాఫీలను ఇకముందు ప్రకటించే అవసరం రాకుండా చూసుకోవాలి. అందుకు అనుగుణంగా బలమైన వ్యయసాయ విధానం అవలంబించాలి. వ్యవసాయానికి ఏమి అవసరమో గుర్తించి ముందుకు సాగాలి. అయితే రుణమాఫీని కూడా తప్పుపట్టి పబ్బం గడుపుకోవాలని రాజకీయా పార్టీలు చూస్తున్నాయి. అలాకాకుండా రైతులు బాగు పడేందుకు తమవద్ద ఉన్న పరిష్కారాలు చెబితే బాగగుంటుంది. రుణమాఫీని కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యతిరే కించిన తీరు ఆశ్చర్యాన్ని కలిగించింది. స్థానిక ఎన్నికల్లో లబ్ది పొందేందుకే రుణమాఫీ చేశారని బండి విమర్శించడం దారుణం. రుణమాఫీ చేయకుంటే ఎప్పుడని అడుగుతారు. చేస్తే.. ఇలా విమర్శలకు దిగుతారు. కెటిఆర్ అయితే అధికారం తమది కాదు కనుక తామున్నదే విమర్శలు చేయడానికి అని ఫిక్స్ అయ్యారు. అందుకే ఆయన అడద్దిడ్డంగా విమర్శలు చేస్తూనే ఉంటారు. కెటిఆర్ బాటలోనే బండి, ఇతర బిజెపి నేతలు విమర్శించడమే సహేతుకంగా లేదు.ఎందుకంటే కేంద్రంలో మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని ఆదుకునే ప్రయత్నం చేయడం లేదు. ఆదుకునే ప్రయత్నాలు చేస్తున్న రాష్ట్రాలను అభినందించడం లేదు. కేవలం రాజకీయాలు చేయడమే వీరు కూడా పనిగా పెట్టుకున్నట్లుగా ఉంది. నిజానికి ప్రజా ప్రభుత్వాలు రైతాంగం పడుతున్న కష్టాలను గుర్తించి, వారి పురోగతిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం తెలంగాణ రైతాంగానికి ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అంద జేయడం నిజంగానే అభినందించాల్సి విషయం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముందుక రావడం మంచి పరిణామం. అయితే ఇది పూర్తిగా రైతుల జీవితాలను బాగుచేస్తుందని చెప్పలేం. ఇది మంచి ప్రయత్నం గానే చూడాలి. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ అనే అంశం దేశంలోనే అత్యంత సాహసోపేత నిర్ణయం. ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ఊతమివ్వడం అనివార్యం కావాలి. దేశానికి వెన్నెముక రైతు అంటూ ప్రకటనలు ఇవ్వకుండా వారికి వెన్నుదన్నుగా ఉండాలన్న సంకల్పం కావాలి. సాగునీటి రంగాన్ని వృద్ధి చేసేందుకు ప్రాజెక్టులు నిర్మించి వాటిని అందుబాటులోకి తేవాలి.సాగునీరు అందుబాటులోకి వచ్చాక, విద్యుత్ కూడా అందుబాటులో ఉండేలా చేయాలి. మార్కెట్లను బలోపేతం చేసిన మద్దతు ధరలకు ధాన్యం కొనుగోలు చేయగలగాలి. పంటలు ఏవి వేయాలో, ఏవి వేస్తే లాభమో కూడా రైతులను చైతన్యం చేయాలి. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి సాగునీరు. విద్యుత్ ఇస్తే రైతులు బంగారం పండిస్తారు. దేశానికి కడుపు నిండా బువ్వ పెడతారు. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. అందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. ఇంతకాలంగా దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న పల్లెలను, కర్షకులను ప్రకృతిని నిర్లక్ష్యం చేయడంతోనే వ్యవసాయ రంగం దెబ్బతింటున్నది. అందుకే ఆహార పదార్థాలు దిగుమతి చేసుకునే దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పట్టించుకోక పోవడంతో పేదరికం ఇంకా విలయతాండవం చేస్తున్నది. రైతుల ఆత్మహత్యలు, నేతన్నల ఆకలిచావులు ఆగడం లేదు. సాగు, తాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. రుణమాఫీకి రేవంత్‌రెడ్డి రూ.31వేల కోట్లు ఖర్చు చేయబోతున్నారు. మానవీయ కోణంలో ఆలోచిస్తే కేవలం తెలంగాణ రాష్ట్రం మాత్రమే ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణమాఫీ కోసం ఖర్చు చేస్తున్నది. అంతేకాక రైతు భరోసా కోసం రూ.8 నుంచి రూ.10 వేల కోట్లు, పంట బీమా, రైతు బీమాకు రూ.5 నుంచి పది వేల కోట్లు ఖర్చు పెడుతున్నది. ఇవే గాక పంట రుణాలు, ఇతరత్రా రుణాల రాయితీల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నది. ఇవన్నీ పెట్టుబుడుగలుగానే గుర్తించాలి. రైతే దేశానికి వెన్నెముక అని ఉ పన్యాసాలిచ్చి వెడుతున్నారే తప్ప, రైతుల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేవారెవ్వరూ కారనరావడం లేదు. పంటలకు బీమా అందించలేకపోయారు. కొత్త వ్యవసాయ విధానాలు అవలంబించాల్సి ఉంది. ఇందుకు తెలంగాణలో అడుగు పడాలి.అప్పుడు దేశమంతా తెలంగాణ మోడల్ అని అభినందిస్తారు. రైతులు కూడా కష్టపడడానికి మరింత ముందుకు వస్తారు. ఈ దిశగా రేవంత్ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించాలి.

# బైడెన్ పట్ల డెమాక్రట్లలో అసమనం

**అభ్యర్థిత్వం మార్చాలన్న డిమాండ్**

**తప్పకుంటేనే మంచిదన్న ఒబామా**

**కమలాహ్యారిస్ వైపు అందరి చూపు**

వాషింగ్టన్,జూలై 19 : అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి.. ఓ వైపు దాడి తర్వాత మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో దూకుడుతో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.. మరోవైపు ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ కూడా ప్రచారాన్ని నిర్వహిస్తున్నప్పటికీ.. డెమోక్రాట్లలో ఆయన ఆరోగ్య పరిస్థితి పార్టీలో టెన్షన్ పుట్టిస్తోంది.. ఇలా అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ అధికార డెమోక్రాటిక్ పార్టీలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు, డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ తీరు, వ్యవహార శైలి పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. ఆయనను మార్చాలనే డిమాండ్లు సొంత పార్టీలోనే వెల్లువెత్తుతున్నాయి. బైడెన్‌కు ప్రత్యామ్నాయం కమలా హ్యారీస్ అన్న విషయం బాగా వినిపిస్తోంది. ఈ విషయాన్ని బైడెన్ వర్గాలు కూడా నిజమే అన్నట్లు తలూపుతున్నారు. దాదాపు చాలా మంది బైడెన్ కంటే కమలా హ్యారిస్ బెటర్ అంటూ పేర్కొంటుండటం సంచలనంగా మారింది..ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరపున జో బైడెన్ మరోసారి రేసులో పాల్గొనేందుకు ఆసక్తిగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇటీవల ఆయన మతిమరుపు సమస్యతో బాధపడుతున్నారు. పలుమార్లు సభల్లో వింతగా ప్రవర్తించారు. దీనికి తోడు ప్రత్యర్థి రిపబ్లికన్ నేత ట్రంప్.. ఎన్నికల ప్రచారంలో దూసుకెళు తున్నారు. దీంతో బైడెన్ కు వ్యతిరేకంగా డెమోక్రాట్లలో అసహనం వ్యక్తం అవుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై జో బైడెన్ పునరాలోచించాలని భావిస్తున్నట్లు మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తెలిపారు. బైడెన్ విజయావకాశాలు సన్నగిల్లినట్లు ఒబామా అంచనా వేస్తున్నారు. బైడెన్ తన అభ్యర్థిత్వాన్ని మరోసారి ఆలోచించాల్సి వస్తుందన్నారు. వాషింగ్టన్ పోస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒబామా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని తమ పార్టీ నేతలకు కూడా చెప్పినట్లు ఒబామా పేర్కొన్నారు. ఒబామా దేశాధ్యక్షుడిగా ఉన్న సమయంలో.. 2009 నుంచి 2017 వరకు జో బైడెన్ ఉపాధ్యక్షుడిగా చేశారు. ఈసారి రేసు నుంచి బైడెన్ తప్పుకోవాలని చాలా మంది డెమోక్రాట్లు అభిప్రాయ పడుతున్నారు. ఇక ఒబామా కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం. ప్రస్తుతం బైడెన్ కోవిడ్‌తో బాధపడుతున్నారు. ఆయన తన ఇంట్లోనే ఉన్నారు. కానీ తన వయసు, ఫిట్‌నెస్ విషయంలో వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. వైట్‌హౌజ్‌కు రేసులోనే ఉన్నట్లు కూడా వెల్లడించారు. గతవారం రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన డిబెట్‌లో బె డెన్ తడబడ్డారు. కొన్నిసార్లు అసంబద్దమైన వ్యాఖ్యలు చేశారు.
ఈ పరిణామాలు డెమోక్రాట్లను కలవరానికి గురిచేస్తున్నాయి. రెండోసారి అమెరికా అధ్యక్షునిగా సర్వీస్ చేసేందుకు ఆయన సమర్థత సరిపోదనే మాట వినిపిస్తోంది. అంతేకాకుండా ఇటీవల న్యూస్ ఏజెన్సీలు జరిపిన సర్వేలు కూడా బైడెన్‌కు ప్రత్యామ్నాయం కమలా హరీస్ అని చెబుతున్నాయి. ఈ సర్వేల్లో ట్రంప్-బైడెన్ ఇద్దరి కంటే 6 పాయింట్ల ముందంజలో కమలా హరీస్ ఉ న్నారట. డెమోక్రాట్లలోని 10మందిలో ఆరుగు కమలా హ్యారిస్ కు మద్దతు తెలపగా.. ఇద్దరు సూటవ్వరని.. మరో ఇద్దరు తెలియదని చెప్పినట్లు ఓ సర్వే తెలిపింది.. మెజారిటీ డెమొక్రాట్‌లు కమలా హారిస్ వైపు నిలుస్తుండటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.. ఈ క్రమంలోనే అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకోవాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించే సత్తా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు ఉందని పలువురు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు.

# లష్కర్ బోనాలకు సిఎం రేవంత్‌కు ఆహ్వానం



హైదరాబాద్,జూలై 19 : సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని సిఎం రేవంత్ రెడ్డిని కమిటీ కోరింది. ఈమేరకు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాలకు ఆహ్వానించింది. ఆలయ అర్చకులు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, తదితరులు సిఎంను కలిసిన వారిలో ఉన్నారు.

# ప్రకటనల పేరుతో ప్రజాధనం వృధా

**ఏకమొత్తంలో 2 లక్షల మాఫీపై చిత్తశుద్ది ఏదీ**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకా, కోవా లక్ష్మి**

హైదరాబాద్,జూలై 19 : రేవంత్ ప్రభుత్వం ప్రకటనల పేరుతో ప్రజా ధనాన్ని ఎందుకు వృథా చేస్తోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ప్రశ్నించారు. ఒకే సారి 2లక్షలు రుణ మాఫీ చేస్తామని చెప్పి మాట తప్పినందుకు కాంగ్రెస్ సంబరాలు చేసుకుంటుందా అని నిలదీశారు. దేవుడి మీద ఒట్టేసి కూడా మాట తప్పుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... రుణమాఫీ చేసి ఎందుకు ఆర్భాటాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఎవరి జాగీరని గతంలో తమను ప్రశ్నించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎవరి జాగీరని ఖర్చు పెడుతున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేదాకా రేవంతరెడ్డిని నిద్రపోనివ్వమని అన్నారు. బౌ రంపేటలో 600మంది రైతులున్న ఓ సొసైటీలో కేవలం 11మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందని.. దీనికే సంబరాలు చేసుకోవాలా? అని నిలదీశారు. లక్షలోపు ఇంత మందికి ఎగ్గొడితే మరి రెండు లక్షల్లో ఎంతమందికి ఎగ్గొడతారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ఉండి ఇంకా కేసీఆర్‌పై ఏడుస్తున్నారని.. అలా చేయొద్దని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ హితవు పలికారు. రైతు భరోసా ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదని బీఆర్ఎస్ అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి (ఐనీలజీ ఒజీలీపతి) ప్రశ్నించారు. రైతులను అడిగి రైతు భరోసా ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శలు చేశారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ... ఐదు ఎకరాలకు మాత్రమే ఇవ్వాలని కాంగ్రెస్ నేతలతో మాట్లడిస్తున్నారని చెప్పారు. రూ. 2 లక్షల రుణమాఫీ ఒకేసారి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్దాలు చెబుతున్నారని కోవాలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నల్లబెల్లం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

మహబూబ్‌నగర్,జూలై 19 : నాటుసారా తయారీకి ఉపయోగించే నిషేధిత నల్లబెల్లాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక నుంచి ఇద్దరు వ్యక్తులు చాల కాలంగా నాగర్ కర్నూల్, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు నాటుసారాకు వినియోగించే బెల్లం, పటికను సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మేరకు శుక్రవారం మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు కర్ణాటక నుంచి వచ్చిన వాహనాన్ని నిలిపి తనిఖీలు నిర్వహించగా ఓ వాహనంలో 15 క్వింటాళ్ల బెల్లం, 40 కిలోల పటిక, నాలుగు లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. మూడు జిల్లాలకు బెల్లాన్ని సరఫరా చేస్తున్న గొల్ల రవి ఉపేంద్ర చారిలని అరెస్ట్ చేశారు. పట్టుబడిన బెల్లం విలువ సుమారు రూ.8.60లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. బెల్లం సరఫరాదారులను పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీకమలహాసన్ రెడ్డి అభినందించారు.

# రేవంత్ చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం

**ఏకమొత్తంగా లక్ష రుణమాఫీ ఆనందదాయకం**

హైదరాబాద్,జూలై 19 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఒకేసారి రూ. లక్ష రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే మాట కట్టుబడి ఉంటుందని.. గత ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ ఆ పార్టీ నాయకులకే ఇచ్చేవారని అన్నారు. అనంతరం కాంగ్రెస్ యూత్ నాయకుడు సంతోష్ యాదవ్ తలపెట్టిన స్కూల్ విద్యార్థులకు బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బోయిన్ పల్లి కూరగాయల మార్కెట్, రెజిమెంటల్ బజార్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారులపై స్థానికుల దాడి

**బకాయిలు అడిగనందుకు ఆగ్రహం**

హైదరాబాద్,జూలై 19 : హైదరాబాద్ నగర పరిధిలోని మోతీనగర్‌లో విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్, మీటర్ రీడర్ పై స్థానికులు దాడి చేశారు. శుక్రవారం మోతీనగర్ లో పెండింగ్ బిల్లులు వసూలు చేసేందుకు లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, మీటర్ రీడర్ వెళ్లారు. పెండింగ్ కరెంట్ బిల్లులు చెల్లించాలని స్థానికులను కోరారు. కరెంట్ బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సప్లయ్ నిలిపివేస్తామని చెప్పడం.. లైన్ ఇన్ స్పెక్టర్, మీటర్ కు స్థానికులకు మధ్య వాగ్వాదం జరిగింది. లైన్ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్, మీటర్ రీడర్ సాయిపై స్థానికుడు రాములు, అతని కుమారుడు దాడి చేశారు. ఈ దాడిలో విద్యుత్ అధికారి శ్రీకాంత్ కు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సనత్ నగర్ పోలీస్ స్టేషన్లలో రాములు, అతని కుమారుడిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మైక్రోసాఫ్ట్.. ఆపరేటింగ్ సర్వర్లు బ్రేక్ డౌన్

**ప్రపంచ వ్యాప్తంగా విమాన సర్వీసులకు బ్రేక్**

**ఆపరేటింగ్ సిస్టమ్ దెబ్బతినడంతో పలు కంపెనీల్లో సమస్యలు**

న్యూయార్క్,జూలై19(ఆర్ఎన్ఎ): మైక్రోసాఫ్ట్.. ఆపరేటింగ్ సర్వర్లు బ్రేక్ డౌన్ కావటంతో.. ప్రపంచ వ్యాప్తంగా విమాన సర్వీసులకు బ్రేక్ పడింది. అమెరికా, ఆస్ట్రేలియాల్లో దేశాల్లో ఎక్కడి విమానాలు అక్కడే ఆగిపోగా.. ఇండియాలో మాత్రం కొన్ని ఎయిర్ పోర్టుల్లో టికెట్ల బుకింగ్ కాకపోవటం వంటి సమస్యలు తలెత్తాయి. కంప్యూటర్లలో మైక్రోసాఫ్ట్ సాఫ్ట్ వేర్ ద్వారా ఆపరేటింగ్ చేసే అన్ని కంపెనీల్లో ఇదే సమస్య తలెత్తింది. మైక్రోసాఫ్ట్ సేవలకు అంతరాయం కలిగింది. ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ క్రౌడ్ స్ట్రైక్ సమస్య ఏర్పడింది. దీంతో మైక్రోసాఫ్ట్ కు సంబంధించిన పలు సేవలు నిలిచిపోయాయి. ఫలితంగా పలు సాఫ్ట్ వేర్ సంస్థలతోపాటు బ్యాంకులు, విమాన సర్వీసులు నిలిచిపోయాయి. ఇండియాలో కూడా సమస్య ఏర్పడింది. ఇండియా కు చెందిన పలు ఎయిర్ లైన్స్ ఇండిగో, ఆకాశ, స్పైస్ జెట్ విమానాలు ఉదయం 10.45 గంటల నుంచి నిలిచిపోయాయి. మైక్రోసాఫ్ట్ విండోస్ ఆధారంగా పనిచేసే ల్యాప్ టాప్ లు , మైక్రోసాఫ్ట్ 360 ఆధారంగా పనిచేసే సర్వీసులపై ఎక్కువగా ప్రభావం చూపింది. అంతేకాదు ఈ సర్వీసులను పొందుతున్న బ్యాంకులు, ÷నాన్షియల్ కంపెనీ?ల, మీడియా సంస్థల్లో పనులు నిలిచిపోయాయి. మైక్రో సాఫ్ట్ సర్వర్లు పనిచేయకపోవడం వల్లనే ఈ సమస్య తలెత్తి ప్రపంచవ్యాప్తంగా విండోస్ ల్యాప్ టాప్ లు పనిచేయడం లేదని టెక్నాలజీ నిపుణులు చెబుతున్నారు. దీనిపై సోషల్ మీడియాలో ఫిర్యాదు కూడా చేస్తున్నారే?. తమ ల్యాప్ టాప్ సైబర్ దాడులకు సైతం గురయ్యాయని యూజర్లు గగ్గోలు పెడుతున్నారు. క్లౌడ్-ఆధారిత సర్వీసులలోయూజర్లు సమస్యలను ఎదుర్కొంటు న్నారు. అవుటేజ్ డిటెక్షన్ ప్లాట్ఫారమ్ డౌన్ డిటెక్టర్ కు ప్రపంచవ్యాప్తంగా ఈ సర్వీసుల అంతరాయం కలిగింది. 74 శాతం మందియూజర్లు మైక్రోసాఫ్ట్ స్టోర్లోకి లాగిన్ అవ్వడంలో ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. అయితే 36శాతం మంది యూజర్లు యాప్ లో సమస్యలను ఎదుర్కొంటున్నారు. అంతేకాదు మైక్రోసాఫ్ట్ విండోస్ ఓఎస్‌తో పనిచేసే ల్యాప్ టాప్ లు ప్రపంచవ్యాప్తంగా షట్ డౌన్ అవుతున్నాయి. యూజర్లు బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్లోపాన్ని ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల తర్వాత చాలా మంది యూజర్లు ల్యాప్ టాప్‌లు రీస్టార్ట్ అవడం ప్రారంభించాయి.మొదట్లో మామూలు అప్డేట్ వల్ల ఇలా జరుగుతోందని అనుకున్నారంతా.. అయితే దాదాపు అన్ని విండోస్ ల్యాప్ టాప్ లలో ఈ పరిస్థితి ఒకదని తర్వాత ఒకటి కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. ల్యాప్ టాప్ లు రీస్టార్ట్ అవుతున్నాయి.. మళ్లీమళ్లీ అప్డేట్ అవడంతోపాటు బ్లూ స్క్రీన్ కనిపించింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 20
జూలై 2024





# భారత్ అదిరే బోణీ



## పాక్‌పై ఘనవిజయం

## మహిళల ఆసియాకప్

దంబుల్లా: మహిళల టీ20 ఆసియాకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ టైటిల్ వేటను ఘనంగా ఆరంభించింది. పాకిస్థాన్‌తో ఆసక్తికరంగా సాగుతుందనుకున్న మ్యాచ్‌ను పూర్తి ఏకపక్షంగా మార్చేసింది. ముందుగా బౌలర్లు సమష్టిగా సత్తా చాటగా, ఓపెనర్లు స్మృతి మంధాన (45), షఫాలీ (40) మెరుపులు తోడవ్వడంతో.. శుక్రవారం గ్రూప్ 'ఎ'లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 19.2 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌటైంది. ఆరంభంలో సిద్రా అమీన్ (25), చివర్లో ఫాతిమా (22 నాటౌట్), తౌబా హుస్సేన్ (22) మాత్రమే ప్రభావం చూపారు. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. స్పిన్నర్ దీప్తికి మూడు.. పేసర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, స్పిన్నర్ శ్రేయాంకలకు రెండేసి వికెట్లు దక్కాయి.

### ఆడుతూ.. పాడుతూ

స్వల్ప ఛేదనను భారత్ 14.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 109 పరుగులతో సునాయాసంగా ముగించింది. ఓపెనర్లు షఫాలీ, స్మృతి మంధాన నువ్వా.. నేనా? అనే రీతిలో సాగించిన ఎదురుదాడికి పాక్ బౌలర్లు చేసేదేమీ లేకపోయింది. ఈ జోడీ బౌండరీల బాదుడుకు పవర్‌ప్లేలో జట్టు 57 పరుగులు సాధించింది. ఆరంభంలో షఫాలీ జోరు చూపినా.. ఆ తర్వాత మంధాన బ్యాట్ ఝుళిపిస్తూ ఎనిమిదో ఓవర్‌లో ఏకంగా ఐదు ఫోర్లతో 21 పరుగులు రాబట్టింది. అయితే ఈ ఇద్దరే ఛేదనను పూర్తి చేస్తారనిపించినా.. లెగ్ స్పిన్నర్ అరూబ్ షా తన వరుస ఓవర్లలో మంధాన, షఫాలీ వికెట్లను తీసింది. దీంతో తొలి వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు హ్యాట్రిక్ ఫోర్లతో మురిపించిన హేమలత (14) 13వ ఓవర్‌లో వెనుదిరిగినా, అప్పటికి ఏడు పరుగులే అవసరం కావడంతో 35 బంతులుండగానే విజయం ఖాయమైంది.

### సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 19.2 ఓవర్లలో 108 ఆలౌట్. (సిద్రా అమీన్ 25, ఫాతిమా 22 నాటౌట్, తౌబా హుస్సేన్ 22బీ దీప్తి 3/20, రేణుకా 2/14, శ్రేయాంక 2/14, వస్త్రాకర్ 2/31).
భారత్: 14.1 ఓవర్లలో 109/3. (మంధాన 45, షఫాలీ 40బీ అరూబ్ షా 2/9).

# పాత కోహ్లిని కాదు.. భయపడకండి

## బీసీసీఐతో విరాట్



విరాట్ కోహ్లి, గౌతమ్ గంభీర్.. భారత క్రికెట్‌లో స్టార్ ప్లేయర్లుగా చరిత్రకెక్కారు. లెక్కలేని రికార్డులు సాధించారు. 2011 వన్డే ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యులుగా ఉన్నారు. దూకుడుగా ప్రత్యర్థిపై మీదకు దూసుకెళ్లే ఈ ఇద్దరూ ఢిల్లీకి చెందినవాళ్లే. 2006లో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కోహ్లి అరంగేట్రం చేసినప్పుడు గంభీర్ ఢిల్లీ యూనిట్‌లోనే ఉన్నాడు. కోహ్లి-గంభీర్ ఆదిలో మంచి మిత్రులుగా ఉన్నారు. 2009లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో తనకి వచ్చిన ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గంభీర్.. కోహ్లికి అందించాడు. 224 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంలో కోహ్లి పాత్ర కీలకమని, తొలి సెంచరీ చేసిన యువ విరాట్‌కు గంభీర్ తన అవార్డు ఇచ్చాడు. మరోవైపు గంభీర్ కోహ్లి కెప్టెన్సీలోనే తన టెస్టు కెరీర్ ముగింపు పలికాడు. అయితే ఎన్నో ఏళ్లు కలిసి క్రికెట్ ఆడిన వీరిద్దరి మధ్య గొడవల ట్రాక్ రికార్డు కూడా గొప్పగానే ఉండటం గమనార్హం. ఐపీఎల్‌లో కోహ్లి-గంభీర్ గొడవ పడిన సందర్భాలు చాలా ఉన్నాయి. 2013, 2015లో వీరిద్దరు తీవ్ర వాగ్వాదం చేసుకున్నారు. ఇక 2023లో కోహ్లి-గంభీర్ గొడవను క్రికెట్ అభిమానులు సులువుగా మరిచిపోలేరు. లక్నో మెంటార్‌గా ఉన్న గంభీర్- ఆర్సీబీ బ్యాటర్ కోహ్లి మ్యాచ్ అనంతరం ఒకరిపైనొకరు దూసుకెళ్లారు. కాగా, ఇంతటి రచ్చ అనంతరం విరాట్ కోహ్లి, గౌతమ్ గంభీర్ తిరిగి కలిసి పనిచేయనున్నారు. రాహుల్ ద్రవిడ్ స్థానంలో గంభీర్ టీమిండియా కోచ్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. శ్రీలంక పర్యటనతో గంభీర్ కోచ్ బాధ్యతలు మొదలుపెట్టనున్నాడు. అయితే లంకతో వన్డే సిరీస్‌లో కోహ్లి కూడా ఆడనున్నాడు. వీరిద్దరు తిరిగి భారత్ తరపున ఒకటిగా పోరాడనున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య మళ్లీ గొడవలు ఏమైనా జరుగుతాయే-ఏమో అని అభిమానులతో సహా బీసీసీఐ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. అయితే అలాంటి భయాలు, ఆందోళనలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, గతంలో గంభీర్‌తో జరిగిన గొడవలను మరిచిపోయానని బీసీసీఐకి విరాట్ కోహ్లి వివరణ ఇచ్చాడు. భారత జట్టు ప్రయోజనం కోసం ఇద్దరం కలిసి పనిచేస్తామని, అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ట్రై చేస్తామని కోహ్లి చెప్పాడు. గంభీర్‌తో ఎలాంటి విభేదాలు ఉండవని బీసీసీఐ పెద్దలకు కోహ్లి హామీ ఇచ్చాడు.

# ఇంకెన్నాళ్లు..బాధను దిగమింగి నవ్వుతూ పోరాడాలి?

హార్దిక్ పాండ్య! అతనికి టైమ్ ఏ మాత్రం కలిసిరావట్లేదు. ఒక్కసారిగా కెరీర్, వ్యక్తిగత జీవితంలో కష్టాలు చుట్టుముట్టాయి. తానే భవిష్యత్ భారత్ కెప్టెన్ అని మొన్నటివరకు చెప్పిన బీసీసీఐ ఇప్పుడు రోహిత్‌కు కొత్త వారసుడిని ప్రకటించింది. అంతేకాదు, హార్దిక్‌ను కనీసం వైస్‌కెప్టెన్‌గా కూడా ఎంపికచేయలేదు. మరోవైపు తన భార్య నటాషాతో విడిపోవాల్సి వచ్చింది. టీ20 వరల్డ్ కప్ విజయంతో తిరిగి తన లైఫ్ మళ్లీ చక్కపడుతుందని అనుకున్న సమయంలో హార్దిక్‌కు వరుసగా ఇలా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. హార్దిక్ కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించట్లేదు. దీంతో హార్దిక్ ధైర్యంగా ఉండాలని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. అయితే ఇప్పుడే కాదు, గత కొన్ని నెలలుగా హార్దిక్ పాండ్యనే హాట్ టాపిక్‌గా మారాడు. మీడియా, సోషల్ మీడియాలో అతని గురించే చర్చ సాగింది. వన్డే వరల్డ్ కప్-2023లో గాయపడటంతో సాఫీగ సాగే అతని జీవితం మలుపు తిరిగింది. ఈ స్టార్ ఆల్‌రౌండర్ టీమిండియాకు దూరమయ్యాడు. ఆ తర్వాత శస్త్రచికిత్స చేసుకోవడంతో తిరిగి పోటీ క్రికెట్ ఆడటానికి నెలలు పాటు వేచి ఉన్నాడు. ఎట్టకేలకు తిరిగి ఫిట్‌నెస్ సాధించుకున్నాడు. మరోవైపు గుజరాత్ టైటాన్స్‌ను రెండు సార్లు ఫైనల్‌కు చేర్చి, ఓ సారి ఛాంపియన్‌గా జట్టును నిలిపిన హార్దిక్ పాండ్య గుజరాత్ ఫ్రాంచైజీని వీడాడు. తిరిగి ముంబై ఇండియన్స్ గూటికి చేరాడు. అంతేగాక రోహిత్ శర్మ స్థానంలో ముంబై జట్టు పగ్గాలు అందుకున్నాడు. ఇది పూర్తిగా క్రికెట్‌కు సంబంధించిన విషయమైనప్పటికీ రోహిత్, ముంబై అభిమానులు హార్దిక్‌ను దారుణంగా మైదానంలో, బయటా అవమానించారు. ఇదిలా జరుగుతుండగా తన వ్యక్తిగత జీవితంతో ప్రకంపనలు మొదలయ్యాయి. అయినప్పటికీ ప్రేక్షకుల హేళనలు, అవమానాలు తట్టుకుంటూ మైదానంలో నవ్వుతూ ముందుకు సాగాడు. ముంబై జట్టులో సహచరుల నుంచి ఆశించినంత సహకారం లభించకపోయినా మౌనంగా ఉండిపోయాడు. టీ20 వరల్డ్ కప్‌లో తిరిగి టీమిండియా జెర్సీ ధరించాడు. తానంత విలువైన ఆటగాడు ప్రపంచ వేదికపై నిరూపించాడు. బౌలింగ్, బ్యాటింగ్‌తో భారత జట్టును ఎన్నో మ్యాచ్‌ల్లో గెలిపించాడు. 13 ఏళ్ల ప్రపంచకప్ నిరీక్షణకు తెరదించడంలో హార్దిక్ కీలకపాత్ర పోషించాడు. మొత్తంగా విమర్శించిన వాళ్లతోనే జైకొట్టించుకున్నాడు. ఈ క్రమంలో ఫైనల్‌లో విజయానంతరం హార్దిక్ భావోద్వేగానికి గురయ్యాడు. కన్నీళ్లతో తన బాధను వెల్లగక్కాడు. మరోవైపు రోహిత్ శర్మ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో హార్దిక్ పూర్తిస్థాయిలో పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా బాధ్యతలు అందుకుంటాడని భావించారంతా. కానీ బీసీసీఐ షాక్ ఇచ్చింది. నయా కోచ్ గంభీర్, సెలక్టర్లు, రోహిత్ శర్మ లేదా జట్టులోని సభ్యుల ఆటగాళ్ల నిర్ణయమో తెలియదు కానీ.. హార్దిక్‌పై వేటు వేశారు. సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. దీంతో హార్దిక్ మరోసారి బాధను దిగమింగుతూ మళ్లీ నవ్వుతూ పోరాడాల్సిన సమయం వచ్చిందని స్టార్ ఆల్‌రౌండర్‌కు మద్దతుగా నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.



# నితీశ్ రెడ్డికి బీసీసీఐ బంపరాఫర్

శ్రీలంక పర్యటనకు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఊహించనట్లుగానే నయా కోచ్ గౌతమ్ గంభీర్ మార్క్ జట్టుపై స్పష్టంగా కనిపించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలో సెలక్షన్ కమిటీ సీనియర్ల ఆటగాళ్లను కొనసాగిస్తూ యువకులకు అవకాశం ఇచ్చింది. జులై 27 నుంచి ప్రారంభంకానున్న మూడు టీ20ల సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా నియమించింది. జట్టులో కొనసాగుతున్నప్పటికీ హార్దిక్ పాండ్యకు సారథి బాధ్యతలు అందివ్వలేదు. వైస్ కెప్టెన్‌గానూ ఎంపికకాలేదు. ఇటీవల జింబాబ్వే పర్యటనను విజయవంతంగా ముగించిన శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేయడం గమనార్హం. ఇక ఆగష్టు 2 నుంచి మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌కు రోహిత్ శర్మ సారథ్యంతో జట్టును బీసీసీఐ ప్రకటించింది. వన్డే సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య ఇద్దరూ జట్టులో లేరు. అయితే వారిద్దరిని విశ్రాంతి కోసమే పక్కనపెట్టలేదని సమాచారం. టీ20ల్లో చెలరేగే సూర్యకు వన్డే ఫార్మాట్‌లో పేలవమైన రికార్డు ఉంది. 37 వన్డేలు ఆడిన సూర్య 25 సగటుతో 773 పరుగులే చేశాడు. గత వన్డే వరల్డ్ కప్‌లో అతని ప్రదర్శనపై పెద్దఎత్తున విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. మరోవైపు హార్దిక్ టీ20ల్లో పునరాగమనం చేసినప్పటికీ వన్డే ఫార్మాట్‌కు తగ్గట్లుగా ఫిట్‌గా లేదని తెలుస్తోంది. పది ఓవర్ల పాటు బౌలింగ్ చేసి, బ్యాటింగ్ చేసేలా సన్నద్ధమైన తర్వాతే హార్దిక్ పరిగణించాలని బీసీసీఐ చూస్తోంది. హార్దిక్ దేశవాళీ క్రికెట్‌లో తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోనే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. ఈ నేపథ్యంలో హార్దిక్, సూర్యను వన్డే జట్టు నుంచి తప్పించారని తెలుస్తోంది. వాళ్ల స్థానంలో ఇతరులకు అవకాశం ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది. ఇక టీ20లకు రిటైర్మెంట్ ఇచ్చిన రవీంద్ర జడేజాను వన్డేలకు కూడా పక్కనపెట్టింది. స్పిన్ ఆల్‌రౌండర్లగా అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌ను మరింత రాటుదేల్చాలని యోచిస్తోంది. అయితే బీసీసీఐ పేస్ ఆల్‌రౌండర్ కోసం ప్రత్యేక దృష్టిసారించింది. హార్దిక్‌కు ప్రత్యామ్నాయ ఆల్‌రౌండర్‌ను అతిత్వరగా సిద్ధం చేయాలని చూస్తోంది. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డిని బీసీసీఐ ఆల్‌రౌండర్‌గా పరిగణిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన నితీశ్ జింబాబ్వే పర్యటనకు తొలుత ఎంపికయ్యాడు. కానీ గాయం కారణంగా జట్టు నుంచి తప్పుకున్నాడు. అతను పూర్తిగా కోలుకున్న తర్వాత టీమిండియాలో వీలైనంత వేగంగా తీసుకురావాలని బీసీసీఐ భావిస్తోంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News



# తమన్నా కావాలా వైబ్స్ మళ్లీ మళ్లీ



రాజ్‌కుమార్ రావ్ - శ్రద్ధా కపూర్ నటించిన స్త్రీ 2 ట్రైలర్ ఎట్టకేలకు విడుదలైంది. హారర్ కామెడీ జానర్ లో బ్లాక్ బస్టర్ మూవీ స్త్రీకి సీక్వెల్ ఇది. పార్ట్ 2 రాక కోసం ప్రతి ఒక్కరూ చాలా ఉత్సాహంగా వేచి చూస్తున్నారు. ట్రైలర్ లో మొండెం లేని భూతం రాజ్‌కుమార్ రావుని ఎందుకు వెంబడించింది? అన్నది తెరపైనే చూడాలి. 'భూతప్రేత స్నేహితురాలు'గా శ్రద్ధ కపూర్ ఈ చిత్రంలో నటించింది. ఆరంభం ఎంత సరదాగా ఉంటుందో జీవితంలో టెర్రర్ అదే రేంజులో ప్రవేశిస్తుంది. భూతంతో స్నేహం ఏ దిశగా దారి తీసింది? అన్నది తెలియాలంటే ఆగస్టు 15 వరకూ ఆగాల్సిందే.

స్త్రీ 2 ట్రైలర్‌లో శ్రద్ధా కపూర్ అందచందాలు మాత్రమే కాదు.. తమన్నా భాటియా వేడెక్కించే హొయలు కూడా ప్రత్యేకంగా ఆకర్షించాయి. ట్రయిలర్ చివరలో తమన్నా పెప్పీ నంబర్ లో ఎంతో రొమాంటిక్ గా కనిపించింది. ఆకుపచ్చ రంగు బ్రాలెట్ - స్కర్ట్‌తో ఆకర్షణీయంగా కనిపించింది. తమన్నా యూనిక్ మూవ్స్‌తో స్క్రీన్ పై మంటలు పెట్టడం ఖాయమని భరోసానిచ్చింది. మిల్కీ బ్యూటీ మూవ్స్.. తన గత బ్లాక్‌బస్టర్ పాట 'కావాలా'ని గుర్తుకు తెస్తున్నాయి. ట్రైలర్‌లో తమన్నా సర్‌ప్రైజ్ ట్విస్ట్ ఉత్కంఠ కలిగించింది. మిల్కీ ఐటెమ్ నంబర్ యూత్ కి స్పెషల్ ట్రీట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు.

స్త్రీ 2018లో విడుదలైంది. ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బాక్సాఫీస్ వద్ద వాణిజ్యపరంగా విజయం సాధించింది. మిలేగీ మిలేగీ .. ఆవో కభీ హవేలీ పే ర్యాగింగ్ చార్ట్‌బస్టర్‌లుగా మారడంతో ఈ చిత్రం సంగీతం కూడా చాలా మంది దృష్టిని ఆకర్షించింది. ఇందులో ప్రత్యేక పాట కమారియాలో నోరా ఫతేహి డ్యాన్స్ ప్రదర్శనను ప్రేక్షకులు ఎప్పటికీ ప్రేమగా గుర్తుంచుకుంటారు. ఇప్పుడు స్త్రీ 2 చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్నారు. దినేష్ విజన్ మాడాక్ ఫిల్మ్స్ - జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. స్త్రీ, రూహి, భేదియా చిత్రాల శ్రేణిలో అదే నిర్మాత రూపొందించిన హారర్-కామెడీ విశ్వంలో ఒక భాగం. స్త్రీ 2 చిత్రం 15 ఆగస్ట్ 2024న థియేటర్లలో విడుదల కానుంది.



# జెబ్బల గౌనులో బుట్టబొమ్మ సయ్యాట!

ఫ్యాషన్ వరల్డ్ లో ముంబై బ్యూటీ పూజాహెగ్డే ఓ స్పెషలిస్ట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అమ్మడి ఎంపికలు అమెలో బ్యూటీని అంతకంతకు హైలైట్ చేస్తుంటాయి. కటౌట్ కి తగ్గట్టు సొగసరి ఎంపిక చేసుకునే దుస్తులే అమ్మడి అందాన్ని రెట్టింపు చేస్తుంటాయి. హైట్..వెయిట్ కి తగ్గట్టు కట్టుబొట్టు ప్రతీ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. డిజైనర్ దుస్తులైనా...సంప్రదాయ వస్త్రాలైనా బుట్టబొమ్మ ధరించిందంటే ఆ దుస్తులకే వన్నె వచ్చేస్తుంది. తాజాగా పూజాహెగ్డే మరోసారి అందాన్ని రెట్టింపు చేసే జెబ్బల గౌనులోకి దూరిపోయింది. ఇదిగో ఇక్కడిలా జెబ్బల గౌనేసి..కళ్లకు అద్దాలు ధరించి కిలకిలా నవ్వేసింది. ఓ చేతిని వయ్యారంగా చాచి..మరో చేతిలో ఐస్ క్రీమ్ తో ఫోజులిచ్చిందిలా. అమ్మడు ముస్తాబైన విధానం.. అలంకరణ ప్రతీది బుట్టబొమ్మని మరింత అందంగా తీర్చి దిద్దాయి. జెబ్బల గౌను ఎప్పుడేసినా? అమ్మడి కోసమే ఆ డిజైన్ పుట్టిందా? అన్న అందంగా హైలైట్ అవుతుంది. తనలో బ్యూటీని బ్యూటీని ప్రాజెక్ట్ చేయడానికి పర్ఫెక్ట్ ఔట్ ఫిట్ ఇది. ఈసారి సంథింగ్ స్పెషల్ గా చేతిలో ఐస్ క్రీమ్ తో మురిపించడం విశేషం. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. పూజా అందానికి నెటి జనులంతా ఫిదా అవుతున్నారు. అమ్మడు క్యూట్ ఫోజుకి కుర్రాళ్లంతా వావ్ అనేస్తున్నారు. ముంబై బ్యూటీనా? మజాకానా? మరి! ఇక పూజా కెరీర సంగతి చూస్తే..టాలీవుడ్ నుంచి ఎంత సాలిడ్ గా వెళ్లిందో? అంతే సాలిడ్ అమ్మడు సౌత్ లో కంబ్యాక్ అవుతోన్న విషయం తెలిసిందే. యువ సామ్రాట్ నాగచైతన్య సరసన ఓ కొత్త సినిమాకి ఇటీవలే సంతకం చేసింది. అతి త్వరలోనే ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. అలాగే కోలీవుడ్ లో సూర్య 44వ చిత్రంలోనూ పూజ అవకాశం అందుకుంది. ఇలా వరుసగా రెండు సినిమాల్లో ఛాన్సులు అందుకోవడం అన్నది చాలా ఈజీగానే జరిగింది.

# పూనమ్ స్టన్నింగ్ లుక్స్.. మైండ్ బ్లాకే



పూనమ్ బజ్వా.. ఈ బ్యూటీ గుర్తుందా? మొదటి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది ఈ బ్యూటీ. ఎవరైనా మొదటి సినిమాతోనే ఎంట్రీ ఇస్తారు కదా అని అనుకోవద్దు. ఆమె యాక్ట్ చేసిన ఫస్ట్ మూవీ పేరే మొదటి సినిమా. సుమారు 19 ఏళ్ల క్రితం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ సినిమాలో క్యూట్ గా కనిపిస్తూ అందరినీ ఆకట్టుకుంది. అందం, అభినయంతో అలరించింది. కుర్రాళ్ల మనసులు దోచేసింది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. మోడల్ గా మంచి పేరు సంపాదించుకున్న పూనమ్.. మొదటి సినిమా తర్వాత కింగ్ నాగార్జున బాస్ తో పాటు ప్రేమంటే ఇంతే, వేడుక, పరుగు సినిమాల్లో యాక్ట్ చేసి మెప్పించింది. కానీ సరైన హిట్ అందుకోలేకపోయింది. దీంతో వేరే భాషల్లో పలు సినిమాలు చేసింది అమ్మడు. టాలీవుడ్ కన్నా కోలీవుడ్ లోనే ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది. స్టార్టింగ్ లో స్కోప్ ఉన్న రోల్స్ అందుకున్నా.. ఆ తర్వాత చిన్న చిన్న పాత్రలకు పరిమితమైంది. చివరగా తెలుగులో ఎన్టీఆర్ కథానాయకుడు మూవీలో యాక్ట్ చేసింది. ఇప్పుడు రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పలు తమిళ, మలయాళ చిత్రాల్లో కూడా నటిస్తోంది. కెరీర్ సంగతి ఎలా ఉన్నా.. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది పూనమ్. ఓ రేంజ్ లో సందడి చేస్తుంటోంది. రోజురోజుకు ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. పర్సనల్ కమ్ ప్రొఫెషనల్ విషయాలను షేర్ చేసుకుంటూ నెటిజన్లతో టచ్ లో ఉంటోంది.

ఎప్పటికప్పుడు గ్లామరస్ పిక్స్ ను పోస్ట్ చేస్తూ.. కుర్రాళ్లకు నిద్ర లేకుండా చేస్తోంది. పొట్టి పొట్టి డ్రెస్సులు, మోడ్రన్ ఔట్ ఫిట్స్ లో అందాలు ఆరబోస్తుంటోంది. అదిరిపోయే పోజులు ఇస్తూ మైమరపిస్తుంటోంది. తన బ్యూటినెస్ తో ఫిదా చేస్తుంటోంది. ఇటీవల శారీతో సర్ప్రైజ్ ఇచ్చిన అమ్మడు.. ఇప్పుడు మరోసారి బ్లాక్ కలర్ డ్రెస్ లో స్కిన్ షోతో అదరగొట్టేసింది. కుర్చీలో కూర్చుని స్టిల్స్ ఇస్తూ మైండ్ బ్లాక్ చేస్తోంది. ఎద అందాలతో నెటిజన్లను కవ్విస్తోంది. హెయిర్ లీవ్ చేసుకుని ఓరగా చూస్తూ అందరినీ ఫ్లాట్ చేస్తోంది పూనమ్. థైస్ షోతో కుర్రకారును ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం పూనమ్ కొత్త పిక్స్.. సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అమ్మడి అందానికి దాసోహమయ్యామని నెటిజన్లు చెబుతున్నారు. గ్లామర్ కు కేరాఫ్ అడ్రస్ పూనమ్ అంటూ కామెంట్స్ పెడుతూ రచ్చ రచ్చ చేస్తున్నారు. లైకుల వర్షం కురిపిస్తూ కామెంట్స్ సెక్షన్ నింపేస్తున్నారు. ఏదైనా పూనమ్ ఈజ్ వెరీ బ్యూటిఫుల్!

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986